
ఆంధ్రజ్యోతి

andhrajyothy.com

మంగళవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 28.4 ; కనిష్ఠం 10.3



కామారెడ్డి
జిల్లా వార్తలు

5

బుధవారం 10 డిసెంబరు 2025




కలెక్టరేట్‌లో తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఆవిష్కరించిన దృశ్యం

కలెక్టరేట్‌లో తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణ

కామారెడ్డి రూరల్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): కామారెడ్డి కలెక్టరేట్ ఆవరణలో నూతనంగా తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. ఈ విగ్రహాన్ని మంగళవారం ఆర్‌అండ్‌బీ అధికారులు ఆవిష్కరించారు. 12 అడుగుల ఎత్తుతో విగ్రహం, నాలుగు అడుగుల బేస్మిట్, విగ్రహం కింద రెండు అడుగుల పీటంతో కలిసి మొత్తం 18 అడుగుల ఎత్తు కలిగిన తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఏర్పాటు చేసినట్లు ఆర్‌అండ్‌బి అధికారులు తెలిపారు.

జిల్లాలో మొదటి విడత పంచాయతీ ఎన్నికలు గురువారం జరగనున్నాయి. కాగా మంగళవారం ఎన్నికల ప్రచారం ముగిసింది. ఓటర్లను తమ వైపు తిప్పుకొనేందుకు అభ్యర్థులు గాలం వేస్తున్నారు. మద్యం, మాంసం, నగదు పంపిణీ చేస్తున్నారు. మందు తాగని వారికి కూల్‌డ్రింక్స్‌ను అందజేస్తున్నారు. అలాగే ఉద్యోగ రీత్యా ఇతర ప్రాంతాలకు వెళ్లిన వలస ఓటర్లను రప్పించేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. కాగా ప్రధాన పార్టీల్లో రెబెల్స్ బెడద ఎక్కువైంది. మొదటి విడత ఎన్నికలు నిర్వహించేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు.



మొదటి విడత ప్రచారానికి తెర

కామారెడ్డి, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): జిల్లాలో గ్రామ పంచాయతీ మొదటి విడత ఎన్నికల ప్రచారం ముగిసింది. గత వారం రోజులుగా పల్లెల్లో అభ్యర్థులు పోటాపోటీగా ప్రచారం నిర్వహించారు. చివరి మూడు రోజులు ప్రధాన పార్టీలకు చెందిన ముఖ్య నేతలు వారి వారి మద్దతుదారుల తరఫున ప్రచారం చేయడంతో పాటు గెలుపు కోసం మంతనాలు సైతం జరుపుతున్నారు. ప్రచారం ముగియడంతో అభ్యర్థులు ప్రలోభాలకు తెర లేపారు. ఓటర్లను ఆకర్షించేందుకు మద్యం, స్వీట్ బాక్స్‌లతోపాటు కొంత నగదు పంపిణీ చేస్తున్నట్లు సమాచారం. పోలింగుకు అధికారులు అన్ని ఏర్పాట్లు చేసింది. ఇక మూడో విడతకు సంబంధించి నామినేషన్ల ఉప సంహరణ పూర్తికావడంతో బరిలో ఉండే అభ్యర్థుల లెక్క తేలింది. మూడవ విడతలో 168 సర్పంచ్ స్థానాలు, 1,482 వార్డు స్థానాలకు నామినేషన్ల ఉప సంహరణ ముగిసింది. బరిలో ఉన్న అభ్యర్థులకు గుర్తులు కేటాయించారు.

- గెలిపే లక్ష్యంగా కాంగ్రెస్, బీఆర్‌ఎస్ నేతలు
- గ్రామాల్లోనే ముఖ్య నేతలు
- మద్దతుదారుల తరఫున ప్రచారం, మంతనాలు
- కొన్ని చోట్ల రెబల్స్ దూకుడుతో ప్రధాన పార్టీల్లో దడ
- ఓటర్లను మచ్చిక చేసుకునేందుకు ప్రలోభాలు
- రేపు మొదటి విడత పోలింగ్.. ఏర్పాట్లు చేసిన యంత్రాంగం
- తేలిన మూడో విడత అభ్యర్థుల లెక్క

రేపు మొదటి విడత పోలింగ్

జిల్లా యంత్రాంగం మొదటి విడత పోలింగుకు సంబంధించి ఏర్పాట్లు పూర్తి చేసింది. గురువారం ఉదయం ఏడు గంటల నుంచి 1 గంటల వరకు పోలింగ్ నిర్వహించనున్నారు. తర్వాత రెండు గంటల నుంచి ఓట్ల లెక్కింపు గెలుపొందిన వారిని ప్రకటిస్తారు. పోలింగుకు సంబంధించి సామగ్రిని ఇప్పటికే ఎన్నికల అధికారులు ఆయా పోలింగ్ కేంద్రాలకు తరలించారు. మొదటి విడతలో 10 మండలాల్లోని 156 సర్పంచ్ స్థానాలకు, 1,084 వార్డు స్థానాలకు పోలింగ్ జరగనుంది. ఇందుకోసం 1,084 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయనున్నారు. పోలింగ్ నిర్వహణకు 6,640 మంది పీవో, ఏపీవోలు విధుల్లో పాల్గొననున్నారు.

ప్రధాన పార్టీల్లో రెబల్స్ దడ

దాదాపు అన్ని పంచాయతీల్లో పోటీ తీవ్రంగానే ఉన్నప్పటికీ ఇటు కాంగ్రెస్, అటు బీఆర్ఎస్ బలపరిచిన అభ్యర్థులకే ఓటర్లు ప్రాధాన్యత కల్పించే పరిస్థితులు ఉన్నాయి. అయినప్పటికీ ఇటు కాంగ్రెస్, అటు బీఆర్ఎస్ రెండింటిలోనూ రెబల్స్ బెడద తప్పడం లేదు. దీంతో ఆయా పార్టీలకు చెందిన ముఖ్యనేతలు గ్రామాల్లోనే ఉంటూ తమ మద్దతుదారులను గెలిపించుకునేందుకు వ్యూహాలు పన్నుతున్నారు. అందుకే నామినేషన్ల ఉప సంహరణ ముగిసిన ఆయా గ్రామాల్లో పోటీదారులు తేలే వరకు అధికార, ప్రతిపక్ష పార్టీల ముఖ్య నేతలు ఎవరు ప్రచారం వైపు తొంగి చూడలేదు. ఉపసంహరణ ముగిసిన తర్వాత కూడా ఆరు రోజుల పాటు ప్రచారం చేసుకునే అవకాశం ఉన్నప్పటికీ కూడా ఆయా పార్టీల ముఖ్య నేతలు ఆచి తూచిగా వ్యవహరించారు. ఎవరు గెలిచినా తమ పార్టీలోకి రావాల్సిందేనని భావించిన నేతలు రెబల్స్ బెడద ఉన్న పంచాయితీల్లో ప్రచారానికి వెళ్లకుండా తెరచాటున మంతనాలు జరుపుతూ వస్తున్నారు.

వలస ఓటర్లను రప్పించే ప్రయత్నం

మొదటి విడత ఎన్నికల పోలింగ్ జరగనున్న నేపథ్యంలో ఆయా పంచాయతీల్లోని అభ్యర్థులు వలస ఓటర్లపై దృష్టి పెట్టారు. గ్రామాల నుంచి పలు నగరాలు పట్టణాలకు వలస వెళ్లిన వారిలో అనేకమంది ఓటర్లు ఉన్నారు. గ్రామాల్లో ఓటు ఉండి ఉద్యోగం, విద్యా, ఉపాధి రీత్యా హైదరాబాద్‌తో పాటు ఇతర పట్టణాలకు

(మిగతా 8లో..)



మద్నూర్ పోలీసు స్టేషన్

భయాందోళనలో సమస్యాత్మక గ్రామాల ప్రజలు

మద్నూర్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): మూడో విడత గ్రామ పంచాయతీ ఎన్నికలు జరగనున్న ఉమ్మడి మద్నూర్ మండలంలో గత ఎన్నికల్లో ప్రభుత్వం గుర్తించిన పది సమస్యాత్మక గ్రామాల్లో ప్రజలు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. ఉమ్మడి మద్నూర్ మండలంలో సమస్యాత్మక గ్రామాలైన కోడ్చిర, డోంగ్లి, పెద్దతడుగూర్, మోగ, లింబూర్, ఎన్ బూర ఆయా గ్రామాల్లో ప్రజలు ఓటు వేయడానికి జంకుతున్నారు. గత ఎన్నికల్లో ఆయా గ్రామాల్లో గొడవల నేపథ్యంలో ప్రజలు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. ఉమ్మడి మద్నూర్ మండలానికి ఒకే పోలీస్‌స్టేషన్ ఉండడంతో డోంగ్లి మండలంలో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఇటీవల ఉమ్మడి మండలానికి నూతనంగా నియమించిన పోలీసు అధికారి సిబ్బంది ఆయా గ్రామాల్లో పర్యటించి ప్రజలకున్న భయాందోళనను తొలగించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. అదేవిధంగా ఆయా గ్రామాల్లో పోలీసు రికార్డుల్లో ఉన్నటువంటి వారిని ముందస్తుగా బైండోవర్ చేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు. ఆయా గ్రామాల్లో పోలీసులు మేమున్నామంటూ భరోసా కల్పించాలని ఎదురు చూస్తున్నారు.

రాత్రయితే.. సుక్కా.. ముక్క

- జోరందుకున్న అభ్యర్థుల పంపకాలు
- ఓట్ల కోసం రూ.లక్షల్లో ఖర్చులు?
- పట్టణాల్లో ఉన్న వారికి రవాణా ఏర్పాట్లు
- చివరి రోజు ర్యాలీలు, ప్రచారం

7



ఎన్నికల అవగాహన సదస్సులో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ కిరణ్మయి

ఎన్నికల విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

- సబ్ కలెక్టర్ కిరణ్మయి

పిట్లం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ ఎన్నికల్లో విధులు నిర్వహించే సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయి హెచ్చరించారు. మంగళవారం గ్రామ పంచాయతీ ఎన్నికలపై సాయిగార్డెన్‌లో ఎన్నికల సిబ్బందికి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయి విచ్చేసి మాట్లాడారు. ఎన్నికల సిబ్బంది తమ విధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎన్నికల్లో విధులు నిర్వహించే పీవో అండ్ ఓపీవోలు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్, ఎంపీడీవో రఘు ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

అన్నా.. ఓటేయరావే..!

- వలస ఓటర్లకు అభ్యర్థుల పిలుపులు
- ప్రయాణ ఖర్చులు చెల్లిస్తామని హామీలు
- గెలుపోటములు ప్రభావితం చేసే అవకాశం
- వలసెల్లినా.. గ్రామాల్లోనే ఓటు

కామారెడ్డి రూరల్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఓటు వేయడానికి రావాలని, ప్రయాణం, మిగతా ఖర్చులన్నీ చెల్లిస్తామంటూ బరిలో నిలిచిన అభ్యర్థులు వలస ఓటర్లను ప్రలోభ పెడుతున్నారు. ఏ ఎన్నికలు వచ్చినా ఊరు విడిచి ఇతర పట్టణ ప్రాంతాలకు వలస వెళ్లి జీవించే వారి ఓట్లను ఆకర్షించేందుకు అభ్యర్థులు నానా తంటాలు పడుతుంటారు. అసెంబ్లీ, పార్లమెంట్ స్థానిక సంస్థల ఎన్నికలు వచ్చినా వలస ఓటర్లను తమ వైపు ఆకర్షించేందుకు నయానా.. బయానా ఇస్తుంటారు. ఒకరికంటే ఒకరు ఎత్తులకు పై ఎత్తులు వేసి వారి ఓట్లను తమవైపు తిప్పుకునేలా చూస్తున్నారు.

కారులో వస్తారా? బస్సులో వస్తారా?

పంచాయతీ ఎన్నికల్లో తక్కువ ఓట్లతోనే జయాపజయాలుంటాయి. కనుక వారిని ఏదో రకంగా ఓటు వేయించాలని కంకణం కట్టుకుంటున్నారు. ప్రతీ గ్రామం నుంచి 10 నుంచి 20 మంది వరకు ఇతర ప్రాంతాల్లో కూలీ పనులు చేసుకొని జీవిస్తున్నారు. ఒక్క రోజు పని పోయినా ఆ కూలీ డబ్బులను మేమే చెల్లిస్తామని, కారులో వస్తారా? బస్సులో వస్తారా? ప్రత్యేకంగా వాహనాన్ని మాట్లాడుకొని వస్తారా? అంటూ బేర సారాలు ఆడుతున్నట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి. విచిత్రమేమిటంటే గ్రామంలోని ఓటర్ల కంటే ముందుగా వలస వెళ్లిన ఓటర్లను ప్రసన్నం చేసుకుంటున్నారని సమాచారం. ఒక్కొక్కరికి కొందరు రూ.500లు (మిగతా 8లో..)



వామ్మో.. చలి పులి

- మళ్లీ పెరిగిన చలి తీవ్రత
- అమాంతంగా పడిపోతున్న కనిష్ఠ ఉష్ణోగ్రతలు
- బీబీపేటలో 7.9 అత్యల్ప ఉష్ణోగ్రత నమోదు
- వణుకుతున్న జిల్లా ప్రజలు
- జాగ్రతలు తీసుకోవాలంటున్న వైద్యులు

కామారెడ్డి రూరల్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): వామ్మో చలి.. పులిలా పంజా విసురుతోంది. గత మూడు, నాలుగు రోజుల నుంచి మళ్లీ చలి తీవ్రత పెరగడంతో జిల్లా వాసులు గజగజ వణికిపోతున్నారు. చలికాలం ప్రారంభమైన నాటి నుంచి చలి తీవ్రత ఉంటూనే వస్తోంది. రాత్రి పూటనే కాకుండా పగటి పూట చలి తీవ్రత తగ్గడం లేదు. చల్లటి ఇదురు గాలులు వీస్తుండడంతో ప్రజలు తట్టుకోలేకపోతున్నారు. మరో మూడు నాలుగు రోజుల పాటు జిల్లాలో చలి తీవ్రత మరింత పెరుగుతుందని, కనిష్ఠ ఉష్ణోగ్రతలు సింగిల్ డిజిట్‌కు పడిపోయే అవకాశాలు ఉన్నాయని వాతావరణశాఖ హెచ్చరిస్తోంది. జిల్లాలోని బీబీపేటలో అత్యల్పంగా 7.9 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది.

వణుకుతున్న జిల్లా ప్రజలు

జిల్లాలో గత రెండు రోజులుగా చలి తీవ్రత పెరుగుతుండడంతో ప్రజలు వణికిపోతున్నారు. ప్రధానంగా వృద్ధులు, పిల్లలు, మహిళలు వ్యాధిగ్రస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పలు ప్రాంతాల్లో పొగమంచు కమ్ముకుంటుంది. చలి ఎక్కువగా ఉండడంతో కూలీలు, వాహనదారులు, చిరు వ్యాపారులు ఇబ్బందులు పడుతున్నారు. చలిని తట్టుకునేందుకు మంటకాగడం, ఉన్ని దుస్తులు ధరించడం, చేతులకు, కళ్లకు గ్లౌజులు వేసుకోవడం, (మిగతా 8లో..)



ఇస్రోజివాడిలో చలిమంటలు కాచుకుంటున్న దృశ్యం



అడిషనల్ కలెక్టర్‌కు వినతి పత్రాన్ని అందజేస్తున్న దృశ్యం

పారదర్శకంగా ఉపాధ్యాయులకు ఎన్నికల విధులు కేటాయించాలి

- ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య సభ్యులు

కామారెడ్డి టౌన్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ ఎన్నికలు జరుగుతున్న పోలింగ్ నిర్వహణ కోసం జిల్లాలోని ఉపాధ్యాయులకు విధుల కేటాయింపులో పాదర్శకత పాటించాలని డిమాండ్ చేస్తూ ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య ప్రతినిధులు మంగళవారం అదనపు కలెక్టర్ మదన్ మోహన్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సమాఖ్య చైర్మన్ పంపరి ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ ఎన్నికల విధుల్లో పాల్గొన్న పోలింగ్ ఆఫీసర్లకు వారి గమ్య స్థానాలకు ఆర్టీసీ బస్సులను ప్రతీ మండలంలో ఏర్పాటు చేయాలని కోరారు. చలి తీవ్రత ఎక్కువగా ఉన్న దృష్ట్యా పోలింగ్ సిబ్బందికి వేడి నీరు అందించాలని ఎలక్షన్ అనంతరం ఈ నెల 12 నుంచి విధులు నిర్వహించే సిబ్బంది ఆన్ డ్యూటీ సౌకర్యం కల్పించాలని, మును ముందు నిర్వహించే ఎన్నికల విధుల్లో ఉపాధ్యాయ సంఘాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులకు ఎన్నికల విధుల్లో మినహాయింపు ఇవ్వాలని, వయస్సు ఎక్కువగా ఉన్న వారికి, ఆరోగ్యం సహకరించని వారికి విధుల్లో మినహాయింపు ఇవ్వాలని కోరారు. ఉన్నత పాఠశాలలో ఉన్న వరుసగా మూడు విడతల్లో విధుల ఆర్డర్ రావడంతో పాఠశాలలు మూతపడే పరిస్థితి సంభవించిందన్నారు. ఎన్నికల నిర్వహణకు ఉపాధ్యాయుల తరఫున అన్ని విధాలుగా సహకరిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రతినిధులు తిరుపతి, ప్రభాకర్, రాములు, బాదవత్ దేవుల తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ పోలింగ్‌కు ఏర్పాట్లు పూర్తి

- కలెక్టర్ ఆశీష్‌సాంగ్వాన్

కామారెడ్డిటౌన్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో మొదటి విడత గ్రామ పంచాయతీ ఎన్నికలకు సంబంధించి ఏర్పాట్లు పూర్తి చేశామని పోలింగ్ సిబ్బంది ర్యాండమైజేషన్ పూర్తయిందని కలెక్టర్ ఆశీష్‌సాంగ్వాన్ అన్నారు. ఎన్నికల నిర్వహణపై మంగళవారం రాష్ట్ర ఎన్నికల కమిషన్ రాణికుముదిని వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లాలో ఎన్నికల నిర్వహణ, పోలింగ్‌పై ఏర్పాట్లను ఎన్నికల కమిషన్ జిల్లా అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికలు నిర్వహించే అధికారులకు పోలింగ్, ఇతర పోలింగ్ అధికారులకు శిక్షణ అందించి పోస్టల్ బ్యాలెట్ వినియోగానికి కౌంటర్లు ఏర్పాటు చేశామన్నారు. పరిశీలకులకు శిక్షణ అందించామని, ఓటరు స్లిప్పుల పంపిణీ పూర్తి చేశామని తెలిపారు. ఆయా మండల కేంద్రాలకు ఎన్నికల సామగ్రిని తరలించామని, ప్రతీ పోలింగ్ కేంద్రం వద్ద పటిష్ఠ బందోబస్తును ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పోలింగ్ ముగిసిన తర్వాత ఓట్ల లెక్కింపు, ఉప సర్పంచ్ ఎన్నిక సజావుగా జరిగేలా పర్యవేక్షించడం జరుగుతుందన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ ఆశీష్‌సాంగ్వాన్, అధికారులు

పోలింగ్ సిబ్బంది ర్యాండమైజేషన్ పూర్తి

మొదటి విడత ఎన్నికలకు సంబంధించి పోలింగ్ అధికారుల, సిబ్బంది ర్యాండమైజేషన్ ప్రక్రియను కలెక్టరేట్‌లోని మినీహాల్‌లో కలెక్టర్ సమక్షంలో నిర్వహించారు. 157 గ్రామ పంచాయతీలు, 1,444 వార్డుల్లో పోలింగ్ జరగనుందని అవసరమైన 1,457 టీమ్‌లు (మిగతా 8లో..

విద్యార్థులు మత్తు పదార్థాలకు బానిస కావొద్దు

- జిల్లా మానసిక వైద్యాధికారి డాక్టర్ రమణ

భిక్కనూరు, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు మత్తు పదార్థాలకు బానిసలై జీవితాలను నాశనం చేసుకోవద్దని జిల్లా మానసిక వైద్యాధికారి డాక్టర్ రమణ సూచించారు. మంగళవారం మండలంలోని జంగంపల్లి కస్తూర్బాగాంధీ పాఠశాలలో విద్యార్థులకు కలెక్టర్ ఆదేశాల మేరకు మానసిక సమస్యలు, మాదకద్రవ్యాల దుష్పరిణామాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ విద్యార్థులు ప్రణాళిక బద్ధంగా చదివి లక్ష్యాలను చేరుకోవాలన్నారు. చెడు మార్గాల పట్ల ఆకర్షితులు కాకుండా ఉండాలన్నారు. విద్యార్థులు పరీక్షల్లో ఫెయిల్ అయ్యామని, తక్కువ మార్కులు వచ్చాయని ఆత్మహత్య ప్రేరేపిత ఆలోచనలకు తావివ్వొద్దని అన్నారు. మానసిక సమస్యలు తలెత్తితే నేరుగా తమను గానీ, 14416 నెంబరుకు గానీ సంప్రదించి తగిన కౌన్సెలింగ్ తీసుకోవచ్చునని (మిగతా 8లో..)



జంగంపల్లిలో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న వైద్యుడు రమణ



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ రాజేష్‌చంద్ర

ఎన్నికలకు పకడ్బందీ బందోబస్తు

- ఎస్పీ రాజేష్‌చంద్ర

కామారెడ్డి, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): జిల్లాలో పంచాయతీ ఎన్నికలు శాంతియుతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు కట్టుదిట్టమైన భద్రతను ఏర్పాటు చేస్తున్నట్లు ఎస్పీ రాజేష్‌చంద్ర తెలిపారు. జిల్లా పోలీసు కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎస్పీ మాట్లాడుతూ జిల్లాలో రెండు అంతర్రాష్ట్ర చెక్‌పోస్టు, మూడు అంతర్ జిల్లా చెక్‌పోస్టులు, 25 ఎఫ్ఎస్‌టీ, ఐదు ఎస్ఎస్‌టీ బృందాల ద్వారా నిరంతర వాహన తనిఖీలు చేపడుతున్నామన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద బందోబస్తుతో పాటు అదనంగా మొదటి విడతలో 54 మొబైల్ రూట్స్, 10 స్ట్రైకింగ్ ఫోర్స్, మూడు స్పెషల్ స్ట్రైకింగ్ ఫోర్స్, రెండవ విడతలో 36 మొబైల్ రూట్స్, 7 స్ట్రైకింగ్ ఫోర్స్, మూడు స్పెషల్ స్ట్రైకింగ్ ఫోర్స్, మూడవ విడతలో 37 మొబైల్ రూట్స్, 8 స్ట్రైకింగ్ ఫోర్స్, మూడు స్పెషల్ స్ట్రైకింగ్ ఫోర్స్ ద్వారా పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. జిల్లాలో 33 క్రిటికల్, 33 సెన్సిటీవ్ పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని, ఆ కేంద్రాల వద్ద ప్రత్యేక బందోబస్తూ చర్యలు చేపడుతున్నామన్నారు. ఎన్నికల్లో ప్రలోభాల్లో భాగంగా మద్యం సరఫరా చేస్తున్న 50 కేసులు నమోదు కాగా బహుమతులుగా అందజేస్తున్న ఇత్తడి బిందెలను స్వాధీనం చేసుకున్నామన్నారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున పోలింగ్ జరిగే సమయంలో ప్రతీ కేంద్రం వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు.

ప్రయాణమే.. ప్రమాదమాయే!

- గుంతలమయంగా జంగంపల్లి- దోమకొండ రహదారి
- తరచూ జరుగుతున్న ప్రమాదాలు
- పట్టించుకోని అధికారులు

8

క్రైం సమాచారం

జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్య



గణేష్

బాన్సువాడ రూరల్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): జీవితంపై విరక్తి చెంది యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని రాంపూర్ తండాకు చెందిన బానోత్ చందర్ కుమారుడు గణేష్(24) ఉపాధి కోసం హైదరాబాద్‌లో రాపిడో డ్రైవర్‌గా పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో జీవితంపై విరక్తి చెంది సోమ వారం రాత్రి దిల్‌సుఖ్‌నగర్‌లోని చైతన్యపురి కాలనీలో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సమాచారం తెలిసిన పోలీసులు కేసు నమోదు చేసు కుని విచారణ జరుపుతున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించి మృతుడి నేత్రాలను ఎల్వీ ప్రసాద్ కంటి ఆసుపత్రికి తల్లిదండ్రులు దానం చేశారు. కుమారుడు చనిపోయిన అతడి నేత్రాలను దానం చేసినందుకు మృతుడి తల్లిదండ్రులను పలువురు అభినందించారు. యువకుడి అకాల మృతితో రాంపూర్ తండాలో విషాదచాయలు అలుముకున్నాయి.

అనారోగ్యంతో జూనియర్ అసిస్టెంట్ మృతి



లలిత

కోటగిరి, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): పోతంగల్ తహసీల్దార్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న లలిత ఆదివారం రాత్రి అనారోగ్యంతో మృతి చెందారు. వారం క్రితం అనారోగ్యానికి గురైన లలిత చికిత్స నిమిత్తం జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ మృతి చెందారు. ఆమె మృతి పట్ల తహసీల్దార్ గంగాధర్, రెవెన్యూ సిబ్బంది సంతాపం వ్యక్తం చేశారు.

ఆర్టీసీ బస్సు అద్దం ధ్వంసం

రుద్రూరు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): బోధన్ డిపోనకు చెందిన టీఎస్ 16 యూసీ 3223 ఆర్టీసీ పల్లె వెలుగు బస్సు వెనుక భాగాన ఉన్న అద్దాన్ని మండల కేంద్రంలోని జేఎస్సీ కాలనీకి చెందిన ఓ వ్యక్తి రాయితో పగలగొట్టాడని ఆర్టీసీ డ్రైవర్, కండక్టర్ తెలిపారు. బాన్సువాడ నుంచి బోధన్ వైపు వెళ్తున్న ఆర్టీసీ పల్లె వెగులు బస్సు అక్బర్‌నగర్ వద్ద చిన్నపాటి జరిగిన గొడవ కారణంగా రుద్రూర్ గ్రామంలోని జేఎస్సీ కాలనీ వద్ద కాలనీకి చెందిన ఓ వ్యక్తి ఆర్టీసీ బస్సు వెనుక భాగాన అద్దాన్ని రాయితో ధ్వంసం చేశాడన్నారు. దీంతో వెనుక సీటులో కూర్చున్న వ్యక్తికి తీవ్ర గాయం అయిందని ఆర్టీసీ డ్రైవర్, కండక్టర్ వివరించారు. వెంటనే పోలీసులకు సమాచారం అందించడంతో ఘటనాస్థలానికి చేరుకొని, వివరాలు సేకరించి కేసు నమోదు చేసుకున్నారు.

గడ్డపార దొంగల గ్యాంగ్ అరెస్టు

- ఐదుగురు నిందితుల రిమాండ్
- భారీగా బంగారం, వెండి నగలు స్వాధీనం

కామారెడ్డి టౌన్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ఆయా మండలాల్లో దొంగతనాలకు పాల్పడుతున్న గడ్డపార గ్యాంగ్‌ను అరెస్టు చేసినట్లు ఎస్పీ రాజేష్ చంద్ర తెలిపారు. మంగళవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. జిల్లాలో పలు ప్రాంతాల్లో రాత్రుల సమయంలో తాళాలు వేసిన ఇళ్లను టార్గెట్‌గా చేసుకొని దొంగల ముఠా గడ్డపారలతో ఇళ్ల తలుపులను ధ్వంసం చేసి చోరీలకు పాల్పడుతున్నారు. ఈనెల 2న ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు గడ్డపారతో ఇంటి తాళాలు పగలకొట్టి బీరువాలోని బంగారం, వెండి నగలు దొంగిలించారని తాడ్వాయి మండలం చిట్యాల గ్రామానికి చెందిన మసుల శ్రీనివాస్ కేసు నమోదు చేసి విచారణ ప్రారంభించామని తెలిపారు. ఎల్లారెడ్డి డీఎస్పీ శ్రీనివాస్‌రావు ఆధ్వర్యంలో ప్రత్యేక టీమ్‌లను ఏర్పాటు చేసి విచారణ ప్రారంభించామన్నారు. మంగళవారం తాడ్వాయి ఎస్‌ఐ తన సిబ్బందితో కలిసి వాహన తనిఖీలు చేస్తుండగా.. గడ్డపార గ్యాంగ్‌లోని ఐదుగురిని పట్టుకున్నట్లు తెలిపారు. ఈ గ్యాంగ్ నాలుగు నెలలుగా తాడ్వాయి, గాంధారి, లింగంపేట్, రాజంపేట్, బాన్సువాడ పరిధిలో కలిపి మొత్తం తొమ్మిది ఇళ్ల తాళాలు పగలగొట్టి దొంగతనాలు చేసినట్లు విచారణలో తెలిసిందన్నారు. ఈ గ్యాంగ్ ప్రధానంగా పగలు, రాత్రి సమయాల్లో లాక్ చేసిన ఇళ్లను గుర్తించి గడ్డపార, ఇనుప రాడ్లతో తలుపుల తాళాలు, బెడ్‌రూమ్, అల్మారీ తాళాలు పగలగొట్టి బంగారం, వెండి నగలు నగదు దొంగతనం చేసేవారని వివరించారు. నిందితులు దొంగిలించిన నగలను కొంతమంది అక్రమ గోల్డ్ కొనుగోలుదారులకు విక్రయించినట్లు కూడా అంగీకరించారన్నారు. అరెస్టు అయిన వారిలో మండలానికి చెందిన బస్సి జోధ్‌రాజ్, అంకుష్ ప్రేమ్‌సింగ్ సాబలే, బామన్ మహేందర్, నూనవత్ గణేష్ ఉన్నారన్నారు. వారి నుంచి 11 తులాల బంగారం, 22 తులాల వెండి, ఒక బైక్, 5 మొబైల్ ఫోన్లు, రూ.8500 నగదు స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. ఈ దర్యాప్తులో నిందితులను పట్టుకోవడంలో చాకచక్యంగా, సమయస్ఫూర్తితో వ్యవహరించి నిందితులను పట్టుకున్న సర్కిల్ ఇన్‌స్పెక్టర్ సంతోష్, తాడ్వాయి ఎస్‌ఐ నరేష్, గాంధారి ఎస్‌ఐ ఆంజనేయులు, కానిస్టేబుల్ సాయిబాబా, రవి, సంజీవ్, హోంగార్డ్ వసంత్ లను జిల్లా ఎస్పీ అభినందించారు. ఈ సమావేశంలో ఎల్లారెడ్డి డీఎస్పీ శ్రీనివాసరావు, సీఐ, ఎస్‌ఐలు పాల్గొన్నారు

ఇళ్లలో చోరీ.. నలుగురికి రిమాండ్

నిజామాబాద్ రూరల్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): జిల్లాకేంద్రంలో ఇళ్లలో చోరీలకు పాల్పడే నలుగురిని అరెస్టు చేసినట్లు రూరల్ సీఐ శ్రీనివాస్ తెలిపారు. మంగళవారం కేసు వివరాలను వెల్లడించారు. ఈనెల 8న సోమవారం ఉదయం 8 గంటల సమయంలో ఖానాపూర్ చౌరస్తా వద్ద బైక్‌పై అనుమానాస్పదంగా సంచరిస్తున్న నలుగురిని రూరల్ పోలీసులు పట్టుకుని విచారించగా.. నిర్మల్ జిల్లా బైంసాకు చెందిన అహ్మద్ హుస్సేన్ (26), అబుబాకర్, నాంపల్లి వెంకటచారి, నాంపల్లి సాయిచరణ్‌లుగా నిర్ధారించారు. వీరు గతంలో నిజామాబాద్ నగరంలోని 1, 3, 4 పట్టణ పోలీసు స్టేషన్ల పరిధిలోని ఇళ్లలో చోరీలకు పాల్పడినట్లు అంగీకరించారు. వీరి నుంచి రూ.70 గ్రాముల బంగారం, వెండి వస్తువులు, 7 వాచ్‌లు, బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు. వీరిని కోర్టులో హాజరుపర్చగా వీరికి 14 రోజుల రిమాండ్ విధించినట్లు తెలిపారు. నగరవాసులు ఎవరైనా ఇంటినుంచి బయటకు వెళ్లినప్పుడు ఇంట్లో విలువైన బంగారు, ఇతర నగలు ఇంట్లో పెట్టకుండా జాగ్రత్తగా ఉండాలని రూరల్ సీఐ శ్రీనివాస్ సూచించారు.

వాహనాల దొంగతనం.. ఇద్దరి అరెస్టు

సుభాష్‌నగర్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): జిల్లాకేంద్రంలోని 1వ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో ద్విచక్ర వాహనాల చోరీకి పాల్పడుతున్న ఇద్దరు దొంగలను అరెస్టు చేసినట్లు 1వ టౌన్ ఎస్‌ఐ రఘుపతి తెలిపారు. పోలీస్ స్టేషన్‌లో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఎస్‌ఐ మాట్లాడారు. బోధన్ మండలం రాకాసిపేటకు చెందిన అమీర్‌ఖాన్, కామారెడ్డి జిల్లా అడ్లూర్ గ్రామానికి చెందిన మహ్మద్ అనిఫ్ బైక్ చోరీలకు పాల్పడుతున్నారు. సీసీ ఫుటేజీల ఆధారంగా నిందితులను పోలీసులు పట్టుకున్నారు. వారిని విచారించగా దొంగతనానికి పాల్పడ్డ 5 బైకులను స్వాధీనం చేసుకున్నారు. నిందితులను మంగళవారం కోర్టులో హాజరుపర్చినట్లు ఎస్‌ఐ వివరించారు.

నగరంలో భారీ అగ్నిప్రమాదం



మంటలు ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది

సుభాష్‌నగర్,డిసెంబరు9 (ఆంధ్రజ్యోతి): నగరంలోని వినాయక్ నగర్‌లోని భవాని పేపర్‌ప్లేట్‌ల దుకాణంలో మంగళవారం భారీ అగ్ని ప్రమాదం జరిగింది. దుకాణంలో ఉన్న పేపర్ ప్లేట్లు, ఇతర వస్తువులు అగ్నికి బూడిద అయ్యాయి. అగ్ని కీలలు అంటుకోగానే దుకాణ యజమాని, స్థానికులు అగ్నిమాపక శాఖకు సమాచారం అందించడంతో సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. షాట్ సర్క్యూట్ కారణంగానే అగ్ని ప్రమాదం జరిగినట్లు అనుమానిస్తున్నారు. ఈ అగ్ని ప్రమాదంలో సుమారు 4.5లక్షల వరకు నష్టం జరిగినట్లు దుకాణ యజమానులు తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

చెట్ల నీడే.. సమావేశ మందిరమాయే

- డొంకేశ్వర్ పీహెచ్‌సీలో గదుల కొరత
- రోగులు, సిబ్బంది అవస్థలు
- చెట్ల కింద సమావేశాలు



డొంకేశ్వర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గదుల కొరత సమస్య గత కొన్ని సంవత్సరాలుగా వేధిస్తోంది. వైద్యం బాగానే అందుతున్న సరిపడా గదులు లేక ఆసుపత్రికి వచ్చే రోగులు, గర్భిణులు ఇబ్బంది పడుతున్నారు. ఆసుపత్రిలో వైద్య సిబ్బందికి, రోగులకు ప్రత్యేక గదులు లేకపోవడంతో పాటు సరైన వసతులు అందడం లేదు. ఆసుపత్రిలో చికిత్స కోసం వచ్చే రోగులకు గదులు సరిపడా లేకపోవడంతో ఇరుకు గదుల్లోనే కార్యకలాపాలు కొనసాగిస్తున్నారు. అదేవిధంగా ప్రతినెలా వైద్య సిబ్బందితో ఏర్పాటు చేసే సమావేశాలు ఆస్పత్రి ఆవరణలో చెట్ల కిందనే నిర్వహించుకోనే పరిస్థితి నెలకొంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి అదనంగా గదులకు నిధులు మంజూరు చేయాలని ప్రజలు కోరుతున్నారు. ఈ విషయమై మండల వైద్యాధికారి సుభాకర్‌ను వివరణ కోరగా.. ఆసుపత్రిలో గదుల కొరత ఉన్న వాస్తవమేనని పేర్కొన్నారు.

- డొంకేశ్వర్



ఎరువుల గోదామును తనిఖీ చేస్తున్న డీఏవో వీరాస్వామి

రైతులకు అందుబాటులో ఎరువులు

- జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వీరాస్వామి

నవీపేట,డిసెంబరు9(ఆంధ్రజ్యోతి): యాసంగి పంటలకు సంబంధించి జిల్లాలో అన్ని రకాల ఎరువులు అందుబాటులో ఉన్నాయని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి జీ.వీరాస్వామి తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలోని పలు ప్రైవేటు ఎరువుల దుకాణాలతో పాటు నాగేపూర్, బినోలలో సొసైటీల పరిధిలోని ఎరువుల గోదాములను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఈపాస్ మిషన్‌లో ఎరువుల స్టాక్ వివరాలను తెలుసుకోవడంతో పాటు గోదాములలో సంబంధిత నిల్వలు, రికార్డులను పరిశీలించారు. యూరియాతో పాటు అన్ని రకాల ఎరువులు అందుబాటులో ఉన్నాయని రైతులు అవసరాలకు అనుగుణంగా కొనుగోలు చేయాలని సూచించారు. రైతులు కొనుగోలు సమయంలో దుకాణదారుల వద్ద నుంచి రసీదును తప్పకుండా తీసుకోవాలని సూచించారు. డీఏవో వెంట ఏవో నవీన్ కుమార్ తదితరులున్నారు.

బాధితులకు న్యాయం చేయాలి

- బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి

వేల్పూర్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని సుదర్శన్ ఇంట్లో దొంగతనం జరగడంతో, నష్టపోయిన ఆ బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి పోలీసులకు సూచించారు. చోరీ జరిగిన విషయాన్ని తెలుసుకున్న ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి మంగళవారం సుదర్శన్ ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను ఓదార్చారు. జరిగిన నష్టాన్ని బాధితులను అడిగి తెలుసుకున్నారు. అ సందర్భంగా అక్కడి నుంచే సీఐతో ఫోన్‌లో మాటాడారు. దొంగలను గుర్తించి బాధితులకు న్యాయం చేయాలని ఆదేశించారు. ఈయన వెంట బీఆర్ఎస్ నేతలున్నారు.



బాధితులను ఓదారుస్తున్న ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి

లైబ్రేరియన్‌పై సస్పెన్షన్ వేటు

- నందిపేట గ్రంథాలయంలోకి కప్పలు, పాములు
- గ్రంథాలయం నిర్వహణపై కలెక్టర్ సీరియస్
- పుస్తకాలు, స్టాకు, పాత పేపర్ల రూంలు సీజ్
- ఔట్ సోర్సింగ్ హెల్పర్‌కు బాధ్యతల అప్పగింత



విచారణ చేపడుతున్న ఏ గ్రేడ్ గ్రంథపాలకుడు రాజారెడ్డి

నందిపేట, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెల్మల్ శాఖా గ్రంథాలయంలోకి కప్పలు, పాములు రావడంతో సిబ్బంది 3 రోజులుగా తాళం వేయడంతో పాఠకులు ఇబ్బందులు పడ్డారు. దీనిపై 'ఆంధ్రజ్యోతి'లో 'గ్రంథాలయానికి గ్రహణం' అనే శీర్షికన కథనం ప్రచురితమైంది. దీనికి స్పందించిన జిల్లా కలెక్టర్ వినయ్‌కృష్ణరెడ్డి విచారణ చేపట్టాలని జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శికి ఆదేశాలు జారీ చేశారు. మంగళవారం ఏ గ్రేడ్ గ్రంథపాలకుడు రాజారెడ్డి విచారణ చేపట్టారు. సగం వరకు తలుపులకు మరమ్మతులు చేయించారు. పుస్తకాలు, మ్యాగజైన్లు, స్టాకు, పాత పేపర్లు ప్రధాన తలుపులకు తాళాలు వేయించి, సీజ్ చేశారు. నివేదికను జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శికి పంపగా ఇన్‌చార్జి లైబ్రేరియన్ టి.నరేష్‌రెడ్డిని విధుల నుంచి తొలగిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. వెల్మల్ శాఖా గ్రంథాలయ విధులను నందిపేట శాఖా గ్రంథాలయం ఔట్ సోర్సింగ్ హెల్పర్ ఎం.నిర్మలకు అప్పజెప్పినట్లు జిల్లా కార్యదర్శి ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

మల్లన్నను దర్శించుకున్న డీసీసీబీ చైర్మన్



సంత మల్లన్నను దర్శించుకుంటున్న రమేష్‌రెడ్డి

వేల్పూర్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అంక్సాపూర్ గ్రామ శివారులో గుట్టపై కొనసాగుతున్న సంత మల్లన్న జాతర ఉత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. మంగళవారం డీసీసీబీ చైర్మన్ రమేష్‌రెడ్డి సంత మల్లన్న స్వామిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా సంత మల్లన్నకు ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గ్రామాభివృద్ధి కమిటీ, ఆలయ కమిటీ ఆధ్వర్యంలో డీసీసీబీ చైర్మన్ రమేష్‌రెడ్డిని సన్మానించారు.

ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు



పోలింగ్‌కేంద్రాలను పరిశీలిస్తున్న డిచ్‌పల్లి సీఐ వినోద్

జక్రాన్‌పల్లి, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నామని డిచ్‌పల్లి సీఐ కే.వినోద్ పేర్కొన్నారు. మండలంలోని పుప్పాలపల్లి, సికింద్రాపూర్, వివేక్‌నగర్ తాండ పోలింగ్ కేంద్రాలను మంగళవారం డిచ్‌పల్లి సీఐ కే. వినోద్ సందర్శించారు. మండలంలో ఈ నెల 14న జరిగే సర్పంచ్ ఎన్నికల దృష్ట్యా పోలింగ్ ప్రశాంతంగా జరిగేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు. భద్రత ఏర్పాట్లు, బారీకెడింగ్, లైటింగ్, కౌంటింగ్ సెంటర్ల ఏర్పాటు తదితర అంశాలపై సమీక్షించారు. పోలింగ్ రోజు ఓటర్లకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా స్వేచ్ఛాయుతంగా ఓటుహక్కు వినియోగించుకునేలా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. శాంతియుతంగా, నిష్పాక్షికంగా, చట్టబద్ధంగా ఎన్నికలను నిర్వహించేందుకు పోలీసు శాఖ పూర్తిస్థాయిలో సిద్ధంగా ఉందన్నారు. సీఐ వెంట జక్రాన్‌పల్లి ఎస్సై జీ.మహేష్, పోలీసులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

ముప్కాల్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ ఎన్నికల వేళ సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని బాల్కొండ ఎస్సై శైలేందర్ సూచించారు. మంగళవారం బాల్కొండ మండల కేంద్రంలోని ప్రధాన కూడలి వద్ద ప్రజలకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల వేళ సైబర్ నేరగాళ్లు కొత్త ఎత్తుగడలతో ముందుకు వస్తున్నారని రాజకీయ పార్టీల పేరిట ఆఫర్ ఫేక్ లింకు పంపిస్తున్నారని తెలియజేశారు. అలాంటి లింకులు ఓపెన్ చేయవద్దన్నారు. తెలియని వ్యక్తులు ఫోన్ చేస్తే ఓటీపీ నెంబర్లు చెప్పవద్దని సూచించారు. మీ కుటుంబ సభ్యులు డిజిటల్ అరెస్టులు అయ్యారని, విడిచి పెట్టడానికి బ్యాంక్ లావాదేవీలు జరపాలని డిమాండ్ చేస్తున్నారని వివరించారు. ఎవరైనా సైబర్ నేరాలకు గురైనప్పుడు టోల్‌ఫ్రీ నెంబర్ 1930కు ఫోన్ ద్వారా ఫిర్యాదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ వాసుదావు, భాస్కర్, రమేష్, ప్రశాంత్, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



బాల్కొండలో ప్రజలకు సైబర్ మోసాలపై అవగాహన కల్పిస్తున్న మండల పోలీసులు

అనుచిత వ్యాఖ్యలు చేస్తే చర్యలు

ముప్కాల్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): బాల్కొండ పోలీస్ స్టేషన్ పరిధిలో ఎవరైనా ఉద్దేశపూర్వకంగా అనుచిత వ్యాఖ్యలు చేస్తూ సోషల్ మీడియాలో వైరల్ చేస్తే వారిపైన కేసు నమోదు చేస్తామని బాల్కొండ ఎస్సై శైలేందర్ హెచ్చరించారు. గ్రామ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో ఉద్దేశ్యపూర్వకంగా రెచ్చగొట్టే మెసేజ్‌లు వాట్సాప్ గ్రూప్, సోషల్ మీడియా ప్లాట్ ఫామ్‌లు పోలీస్ వారి పర్యవేక్షణలో ఉన్నట్లు గమనించాలని సూచించారు. ప్రజలు ప్రతీఒక్కరు తమ ఓటుహక్కును వినియోగించుకోవాలని సూచించారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.



ఎంఈవోకు వినతిపత్రం అందజేస్తున్న ఎన్ఎస్‌యూఐ నాయకులు

ఉపాధ్యాయులను నియమించాలి

- ఎన్ఎస్‌యూఐ డిమాండ్

భీమ్‌గల్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): పట్టణకేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టుల్లో వెంటనే నియమించాలని ఎన్ఎస్‌యూఐ జిల్లా ఉపాధ్యక్షుడు రెహమాన్ డిమాండ్ చే శారు. సంఘం నాయకులతో కలిసి ఎంఈవో స్వామికి మంగళవారం వినతిపత్రం అందజే శారు. పాఠశాలలో తెలుగు, ఉర్దూ మీడియం బోధించడానికి నలుగురు ఉపాధ్యాయులు లేరని దీంతో విద్యాసంవత్సరం పూర్తవుతున్న వేళ, పదో తరగతి పరీక్షలకు సన్నద్ధమయ్యే విద్యార్థులు నష్టపోతున్నారని పేర్కొన్నారు. వెంటనే ఉపాధ్యాయులను నియమించాలని ఎంఈవోను కోరారు. అలాగే పాఠశాలలో వంట గది నిర్మించాలని కోరారు. వినతిపత్రం అందించిన వారిలో పలువురు నాయకులు ఉన్నారు.



మాట్లాడుతున్న భీమ్‌గల్ తహసీల్దార్ షబ్బీర్

దివ్యాంగుల దినోత్సవం

భీమ్‌గల్ రూరల్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం ఐకేపీ ఆధ్వర్యంలో మంగళవారం ఘనం గా నిర్వహించారు. తహసీల్దార్ షబ్బీర్, ఎంపీడీవో సంతోష్ కుమార్, ఎంఈవో స్వామి, ఎస్‌ఐ సందీప్ జ్యోతి ప్రజ్వలన చేసి దివ్యాంగులకు భరోసా కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఏ సమస్య ఉన్న అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. దివ్యాంగులకు చేతి కర్రలు, చంక కర్రలు, వినికిడి యంత్రాలు, ట్రై సైకిళ్లు, పింఛన్లు అందరికీ వచ్చేలా కృషి చేస్తామని అధికారులు హామీ ఇచ్చారు. అనంతరం పావురాలను ఎగరవేశారు. కార్యక్రమంలో ఐకేపీ ఏపీఎం ప్రమీలా, సీపీలు కుంట శ్రీనివాస్, సుమలత, నరేష్, రఘుపతి, శ్రీనివాస్, మహిళా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

గుర్తుల కేటాయింపు

కమ్మర్‌పల్లి, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): ఈ నెల 17 న మూడవ విడతగా జరుగనున్న సర్పంచ్, వార్డు సభ్యుల నామినేషన్ ఉపసంహరణ మంగళవారం ముగిసింది. దీంతో కమ్మర్‌పల్లి మండలంలో 14 పంచాయతీలకు ఒకటి(డొమ్మరిసొడు తండా సర్పంచ్, వార్డు సభ్యులందరూ ఏకగ్రీవం) కాగా మిగిలిన 13 గ్రామ పంచాయతీలకు 56 మంది సర్పంచ్ అభ్యర్థులుగా బరిలో నిలిచారు. 13 పంచాయతీల్లో 138 వార్డులకు 36 వార్డులు ఏకగ్రీవమయ్యాయి. మిగిలిన 102 వార్డులలో 276 మంది బరిలో నిలిచారు. నామినేషన్ల ఉపసంహరణ ప్రక్రియ ముగియగానే అధికారులు బరిలో నిలిచిన సర్పంచ్, వార్డు సభ్యుల అభ్యర్థులకు గుర్తులు కేటాయించారు. దీంతో అభ్యర్థులు తమ గుర్తులతో ప్రచార సామగ్రి కొనుగోలు చేసే పనిలో నిమగ్నమయ్యారు.

ఏకమై.. ఏకగ్రీవం చేసి

- ముగిసిన మూడో విడత నామినేషన్ల ఉపసంహరణ
- ఆర్మూర్ డివిజన్‌లో పలు గ్రామ పంచాయతీల్లో ఏకగ్రీవాలు
- వార్డు సభ్యుల స్థానాలకు ఒక్కో నామినేషన్
- ఒకే తాటిపైకి గ్రామస్థులు



పీట్ల శ్రీనివాస్ (అంక్సాపూర్)



షైలారం సంతోష్(జాన్కంపేట్)



నూతుల విజయ(కొత్తపల్లి)



గడ్డం అనిల్, (దొన్కల్)



యాల్లా సాయరెడ్డి (మిర్దాపల్లి)



ఇట్టెడి లింగారెడ్డి , (దేగాం)



రాచర్ల సవిత (సిర్పూర్)

వేల్పూర్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలో సర్పంచ్, వార్డు సభ్యుల నామినేషన్ల ఉపసంహరణ మంగళవారం ముగిసింది. 4 గ్రామ పంచాయతీలు ఏకగ్రీవం అయినట్లు ఎంపీడీవో బాలకిషన్ తెలిపారు. అంక్సాపూర్‌లో సర్పంచ్, 12 వార్డు సభ్యుల స్థానాలు, జాన్కంపేట్, కొత్తపల్లి(ఎన్), హనుమాన్‌నగర్ (పడిగెల ఒడ్డెర కాలనీ)లలో సర్పంచ్‌లు, 8 చొప్పున వార్డు సభ్యులు స్థానాలు ఏకగ్రీవమైనట్లు వెల్లడించారు. అంక్సాపూర్ సర్పంచ్ పదవి ఎస్సీ జనరల్‌గా రిజర్వ్ కావడంతో పీట్ల శ్రీనివాస్, కొత్తపల్లి జనరల్ మహిళకు రిజర్వు కాగా నూతుల విజయ, జాన్కంపేట్‌లో జనరల్ రిజర్వ్ కాగా షైలారం(కొలిప్యాక్) సంతోష్, హనుమాన్ నగర్ జనరల్ రిజర్వు కాగా అల్లెపు నడిపి మల్లయ్య ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మండలం లో మిగితా 14 గ్రామ పంచాయితీల్లో ఇద్దరి నుంచి ముగ్గురు చొప్పున సర్పంచ్ పదవి బరిలో ఉన్నారు.

ఆలూర్‌లో 3 సర్పంచ్ స్థానాలు..

ఆలూర్: మండలంలో మంగళవారం నామినేషన్ల ఉపసంహరణ అనంతరం మూడు సర్పంచ్ స్థానాలు ఏకగ్రీవమైట్లు అధికారులు ప్రకటించారు. మిర్దాపల్లిలో యాల్లా సాయరెడ్డి సర్పంచ్ స్థానం, పూర్తిగా వార్డు స్థానాలు, రామస్వామికి క్యాంప్‌లో సర్పంచ్‌గా పసుల పుష్ప, వార్డు స్థానాలు ఏకగ్రీవం అయ్యాయని, దేగాం గ్రామంలో ఇట్టెడి లింగారెడ్డి సర్పంచ్‌గా ఏకగ్రీవమైనట్లు అధికారులు తెలిపారు.

సిర్పూర్ సర్పంచ్‌గా సవిత..

డొంకేశ్వర్: మూడో విడత ఎన్నికల నామినేషన్ల ఉపసంహరణ గడువు మంగళవారం తో ముగిసింది. 13 పంచాయతీలకు సి ర్పూర్ ఏకగ్రీవం.. కాగా 12 సర్పంచి స్థానాలకు 44 మంది పోటీలో ఉన్నారు. 118 వార్డులకు 48 ఏకగ్రీవమ య్యాయి. 70 వార్డులకు 204మంది పోటీలో ఉన్నారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా సిర్పూర్ గ్రామస్థులంతా కలిసి సర్పంచ్, వార్డు స్థానాలకు ఒకరితోనే నామినేషన్ వేయించారు. అందరూ కలిసి ఏకతాటిపై నిలిచి మండ లంలోని సిర్పూర్ గ్రామ సర్పంచ్ స్థానంతో పా టు 8 వార్డులు స్థానాల్లో ఒక్కో నామినేషన్ వేశారు. అయితే ఇక్కడ 964 మంది ఓటర్లు ఉన్నారు. సర్పంచ్ స్థానం ఎస్సీ మహిళకు కేటా యించగా.. రాచర్ల సవిత నామినేషన్ వేశారు. ఎనిమిది వార్డు స్థానాలకు ఒక్కొక్కటి చొప్పున నామినేషన్లు రావడం అధికారుల పరిశీలనలో చెల్లుబాటు కావడంతో సిర్పూర్ సర్పంచుగా రాచర్ల సవిత, 8 మంది వార్డు సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు అధికారులు ప్రకటించారు.

సుర్భిర్యాల్ సర్పంచ్‌గా శ్రీనివాస్..

ఆర్మూర్: మండలంలోని సుర్భిర్యాల్ సర్పంచ్‌గా ఎర్రం శ్రీనివాస్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. పోటీలో ఉన్న ప్రత్యర్థులు మంగళవారం నామినేషన్లను ఉపసంహరించుకోవడంతో శ్రీనివాస్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సర్పంచ్ ఏకగ్రీవ ఎన్నికను అధికారులు అధికారికంగా ప్రకటించాల్సి ఉంది.

దొన్కల్ సర్పంచ్ పదవి ఏకగ్రీవం

మోర్తాడ్: మండలంలోని దొన్కల్ సర్పంచ్‌గా గడ్డం అనిల్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మంగళవారం పోటీలో ఉన్న అభ్యర్థులు నామినేషన్లు ఉపసంహరించుకోవడంతో గడ్డం అనిల్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అంతేకాక వార్డు సభ్యులు కూడా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మండలంలోని మిగతా పంచాయతీల్లో ముగ్గురు, నలుగురి అభ్యర్థులు బరిలో ఉన్నారు. దీంతో పోరు రసవత్తరంగా మారనుంది. నేడు గుర్తులను సైతం కేటాయించడంతో అభ్యర్థులు ప్రచార సామగ్రి కొనుగోలు చేసే పనిలో నిమగ్నమయ్యారు.

చేతులు కలిపితే ఉద్యోగం పోయినట్టే ..!

కామారెడ్డి రూరల్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఎన్నికలు జరిగే సమయంలో మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ అమలులో ఉంటుంది. దీని ఉద్దేశం ప్రభుత్వ ఉద్యోగులు ఎన్నికల సంఘం ఆధ్వర్యంలో పని చేస్తున్నట్లు లెక్క. అయితే కొందరు ఉద్యోగులు తెలియని తనం, అత్యుత్సాహంతో ఎన్నికల బరిలో నిలిచిన అభ్యర్థులతో కరచాలనం చేయడం, సన్నిహితంగా ఉండటం చేస్తుంటారు. ఇలా చేయడం తప్పని ఎన్నికల సంఘం చెబుతోంది. ఎన్నికల నియమావళిని ఉల్లంఘిస్తే ఉద్యోగం ఊడిపోయే ప్రమాదముందని హెచ్చరిస్తోంది.

కరచాలనం ఎందుకు చేయకూడదు ..?

ఉద్యోగులు ఒక అభ్యర్థికి బహిరంగంగా కరచాలనం చేయడం, సన్నిహితంగా ఉండడం ద్వారా ఆ అభ్యర్థికి మద్దతు ఇస్తున్నారనే లేదా అనుకూలంగా ఉన్నారనే భావన ప్రజల్లో కలుగుతుంది. దీంతో ఎన్నికల ప్రక్రియ పై విశ్వసనీయత సన్నగిల్లే అవకాశం ఉంది.

పరిధి దాటితే శిక్ష తప్పదు

ఎన్నికల విధుల్లో ఉన్న అధికారులు ఎన్నికల నియమావళిని ఉల్లంఘిస్తే శిక్షలు తప్పవు. క్రమ శిక్షణ చర్యలు తీసుకునే అవకాశం ఉంది. నిబంధనల ఉల్లంఘన తీవ్రతను బట్టి సర్వీస్ రూల్స్ ప్రకారం శాఖపరమైన విచారణ ఎదుర్కోవాల్సి ఉంటుంది. వేతన పెరుగుదల, పదోన్నతి నిలిపివేయడం, కొన్ని సందర్భాల్లో ఉద్యోగం నుంచి తొలగించడం, నిర్బంధ పదవీ విరమణ చేయిస్తారు. ఉద్దేశపూర్వకంగా ఫలితాలను ప్రభావితం చేయడానికి ప్రయత్నిస్తే కేసులు నమోదుచేసి జైలుకు పంపే అవకాశం ఉంది. కొన్ని సందర్భాల్లో జరిమానాలు విధిస్తారు.

ఎన్నికల పండక్కి.. కాసుల పంట



ఏర్గట్ల, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ ఎన్నికల పోరుతో పల్లెల్లో సందడి వాతావరణం నెలకొంది. బరిలో నిలిచే అభ్యర్థులు హామీల వర్షంతో గెలుపే లక్ష్యంగా ముందుకెళ్తున్నారు. ఇప్పటికే మొదటి విడత ఎన్నికల్లో పాల్గొనే నేతలు ప్రచారం పూర్తిచేసుకోగా.. మిగతా రెండు విడతలకు సంబంధించిన నేతలు ప్రచారం కొనసాగిస్తున్నారు. అయితే ఎన్నికల పుణ్యమా అని గత రెండేళ్ల తరువాత వచ్చిన ఎన్నికలతో గ్రామ పంచాయతీలకు ఆదాయాన్ని పెంచాయి. దీంతో పంచాయతీలకు కాసుల పంట కురుస్తోంది. ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థితో పాటు వారిని బలపరచిన వారి నో డ్యూస్ సర్టిఫికెట్ ఉండాలని నిబంధన ఉండటంతో తప్పని సరి చెల్లించే పరిస్థితి ఏర్పడింది. ఈ క్రమంలో అభ్యర్థులు తమ ఇంటి పన్నులు పెండింగ్‌లో ఉంచుకోవద్దనే ఉద్దేశంతో ఇంటి పన్నులు చెల్లిం చారు. ఈ మండలంలోని 8 గ్రామాల్లో సర్పంచ్ స్థానాలకు 49 మంది, వార్డు సభ్యులకు గాను 174 మంది నామినేష్ దాఖాలు చేశారు. దీంతో 10 శాతం మేర మండల వ్యాప్తంగా 5 లక్షల పన్నులు వసూలైనట్లు అధికారులు తెలిపారు. ఇంత కాలంగా ఉన్న మొండి బకాయిల సమస్య కొంతమేర తప్పిందంటున్నారు.

పల్లెపోరులో గమ్మత్తైన గుర్తులు

మద్నూర్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : పంచాయితీ ఎన్నికల ప్రక్రియ ప్రారంభం కావడంతో పాటు మంగళవారం అభ్యర్థులకు గుర్తులు కేటాయించటంతో ప్రచారం ముమ్మరంగా కొనసాగుతుంది. గెలుపే లక్ష్యంగా అభ్యర్థులు దూసుకెళ్తున్నారు. ఉదయం లేచిన దగ్గర నుంచి రాత్రయ్యే వరకు గ్రామాల్లో విస్తృతంగా పర్యటిస్తూ ప్రతిఒక్కరినీ కలుస్తూ ఓట్లు రాబట్టేందుకు కృషి చేస్తున్నారు. అయితే సర్పంచ్ అభ్యర్థులకు 32 గుర్తులను వార్డులకు 20 గుర్తులను ఎన్నికల కమిషన్ కేటాయించింది. సర్పంచులకు, వార్డు సభ్యులకు వేర్వేరుగా ఎన్నికల గుర్తులు కేటాయించారు. ఎన్నికల కమిషనర్ కేటాయించిన కొన్ని గుర్తులపై అభ్యర్థుల పెదవి విరుపు కనిపిస్తుంది. సర్పంచ్, వార్డులకు కేటాయించిన ఎన్నికల గుర్తులపై పలువురు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇవి ఏం గుర్తుందని పెదవి విరుస్తున్నారు. అభ్యర్థులకు రిటర్నింగ్ అధికారులు అక్షర క్రమంలో గుర్తులు కేటాయించారు. తమకు వచ్చిన గుర్తును గ్రామీణ ఓటర్లు దాన్ని సరిగా గుర్తిస్తారో లేదో అని మదన పడుతున్నారు. మంచం, టేబుల్, బ్లాక్ బోర్డు, పలక, బిస్కెట్ లాంటి వాటిల్లో కొన్నింటి పోలిక దగ్గరగా ఉందంటున్నారు. స్టంప్స్ హాకీ స్టిక్, నిరక్షరాస్యులకు ఏం తెలుసు అని ప్రశ్నిస్తున్నారు. గుర్తులు సరిగ్గా గుర్తుంచుకునేలా చాలా మంది అభ్యర్థులు ఆ గుర్తుతో కూడిన నమూనా తయారుచేయించి ప్రచారం చేస్తుండగా మరికొందరు గుర్తుల నమూనాలను ఇంటింటికీ పంచుతూ ఓట్లు అభ్యర్థిస్తున్నారు.



బీర్కూర్‌లో కంటి వైద్యశిబిరం



బీర్కూర్‌లో కంటి పరీక్షలు చేస్తున్న వైద్యుడు

బీర్కూర్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): బీర్కూర్ మండల కేంద్రంలో మంగళవారం బీర్కూర్ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో కంటి వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. ఈ శిబిరంలో 35 మందికి కంటి పరీక్షలు చేసినట్లు క్లబ్ సభ్యులు తెలిపారు. ఇందులో ఏడుగురికి మోతిబిందు ఉన్నట్లు నిర్ధారించారు. శస్త్ర చికిత్స నిమిత్తం వారిని బోధన్ లయన్స్ క్లబ్ ఆసుపత్రికి రిఫర్ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో లయన్స్ అధ్యక్షులు రమేష్, జోన్ చైర్మన్ కొట్టూరి సంతోష్, లయన్స్ సభ్యులు బస్వాంత్, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్ దీక్షతోనే ప్రత్యేక తెలంగాణ



తెలంగాణ తల్లి చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహిస్తున్న దృశ్యం

బాన్సువాడటౌన్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన కోసం కేసీఆర్ దీక్ష చేపట్టారని, ఆ దీక్షతో పాటు అన్ని వర్గాల ప్రజల నుంచి వచ్చిన సహకారంతోనే నేడు తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడిందని మాజీ ఎమ్మెల్యే, బాన్సువాడ బీఆర్ఎస్ ఇన్‌చార్జి బాజిరెడ్డి గోవర్ధన్ అన్నారు. మంగళవారం పట్టణంలో బీఆర్ఎస్ నాయకులతో కలిసి ఆయన దీక్షా విజయ్‌దివస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. స్థానిక అంబేద్కర్ చౌరస్తా వద్ద బాబా సాహెబ్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. తెలంగాణ తల్లి చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. అనంతరం స్థానిక ఆస్పత్రిలో రోగులకు పండ్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేసీఆర్‌తోనే చాలా మంది ఎమ్మెల్యేలుగా, మంత్రులుగా ఎదిగారని, కానీ నేడు కేసీఆర్‌ను మోసం చేశారని మండిపడ్డారు. సర్పంచ్ ఎన్నికలలో బీఆర్ఎస్ అభ్యర్థులు గెలుపించి సత్తా చూపిస్తామన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, తదితరులు ఉన్నారు.

డిగ్రీ పరీక్షలు ప్రశాంతం

ఇందూరు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ విశ్వవిద్యాలయం పరిధిలోని డిగ్రీ పరీక్షలు మంగళవారం ప్రశాంతంగా జరిగాయి. 17వ రోజు జరిగిన డిగ్రీ సీఈబీసీఎల్, 1వ, 3వ, 5వ సెమిస్టర్, 2వ, 4వ, 6వ సెమిస్టర్ బ్యాక్‌లాగ్ థియరీ పరీక్షలు జరిగాయి. ఉమ్మడి నిజామాబాద్ జిల్లావ్యాప్తంగా 30 సెంటర్‌లలో పరీక్షలు నిర్వహించారు. మంగళవారం జరిగిన పరీక్షకు 386 మంది విద్యార్థులు హాజరుకావాల్సి ఉండగా, 374 మంది విద్యార్థులు హాజరయ్యారని, 12 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని ఆడిట్‌సెల్ డైరెక్టర్ గంటా చంద్రశేఖర్ తెలిపారు.

రాత్రయితే.. సుక్క.. ముక్క



- గ్రామాల్లో జోరందుకున్న అభ్యర్థుల పంపకాలు
- ఓట్ల కోసం రూ.లక్షల్లో ఖర్చు
- పట్టణాల్లో ఉన్న వారికి రవాణా ఏర్పాట్లు
- చివరిరోజు ర్యాలీలు, విస్తృత ప్రచారం

భిక్కనూరు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ ఎన్నికల్లో మొదటి విడత ఎన్నికలు చివరి ఘట్టానికి చేరుకున్నాయి. గురువారం ఉదయం 7గంటల నుండి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఎన్నికలు జరగనున్నాయి. మంగళవారం సాయంత్రానికి అభ్యర్థుల ప్రచారాని కి ముగింపు పలకగా సర్పంచ్, వార్డుస్థానాల అభ్యర్థులు ఓటర్లను మచ్చిక చేసుకునే పనిలో పడ్డారు. ఈ మేరకు మంగళవారం నుంచి అభ్యర్థులు గ్రామాల్లో ఇంటింటికీ మద్యం, చికెన్ పంపిణీ చేస్తున్నారు. ఎన్నికల నేపథ్యంలో మద్యం దుకాణాలు మంగళవారం సాయంత్రం నుండి మూసివేయగా సర్పంచ్, వార్డు స్థానాల అభ్యర్థులు మద్యాన్ని ముందస్తుగా కొనుగోలు చేసి తమకు అనుకూలమైన స్థలంలో డంప్ చేసుకున్నారు. తెలిసిన చికెన్ దుకాణాల యాజమానులతో ఒక ధర నిర్ణయించుకుని ప్యాకెట్లలో అరకిలో, కిలో చొప్పున ప్యాక్ చేయించుకుని గ్రామంలోని ప్రతి గడపగడపకు వెళ్లి ఈ సారి ఒక్క చాన్సు ఇవ్వాలని, తనకు ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థించడంతో పాటుగా ఒక చెకెన్ ప్యాకెట్, మద్యం బాటిల్‌ను, కూల్‌డ్రింక్స్‌ను అందజేసి ఓటర్లను తమవైపుకు తిప్పుకుంటున్నారు.

జోరందుకున్న అభ్యర్థుల పంపకాలు..

మొదటి విడత ఎన్నికల పోలింగ్ గురువారం మధ్యా హ్నం జరగనున్న నేపథ్యంలో మంగళవారానికి నిబంధ నల ప్రకారం అభ్యర్థుల ప్రచారం ముగిసింది. ఇక పోలింగ్‌కు బుధవారం ఒకరోజు మిగిలి ఉంది. ఇప్పటికే చాలా గ్రామాల్లో మంగళవారం నుంచే ఇంటింటికీ మద్యం బాటిల్, కూల్‌డ్రింక్, చికెన్ పొట్లాన్ని పంపిణీ చేస్తున్నట్లు సమాచారం. యూత్‌లకు దావత్‌లు ఇస్తున్నారు. విజయం ఎవరికి దక్కుతుందో కానీ ఓటర్లను తృప్తి పర్చడంలో అభ్యర్థులు తగ్గట్లేదు.

లక్షల్లో ఖర్చు..

ఓట్లు ఎటు పడుతాయో, ఎవరు గెలుస్తారో పక్కన పెడితే మొదటి విడత ఎన్నికలు జరిగే గ్రామాల్లో మంగళవారం నుండే పండుగ వాతవరణం నెలకొంది. ఎక్కడా చూసిన విందులు, దావత్‌లు కనిపిస్తున్నాయి. రాత్రి అయ్యిందంటే చాలు దావత్‌ల హడావిడి నడుస్తోంది. అభ్యర్థులు తమ గెలుపు కోసం రూ.లక్షల్లో ఖర్చు పెట్టడానికి కూడా వెనుకాడటం లేదు. ఖర్చు ఎంతైనా సరే గెలుపు ముఖ్యం అన్నట్లుగా సాగుతోంది.

రవాణా ఏర్పాట్లు..

అభ్యర్థులు గ్రామంలో విస్తృత ప్రచారంతో పాటుగా గ్రామాల నుంచి పట్టణాల్లో, ఇతర ప్రాంతాల్లో ఉంటున్న వారిపై దృష్టి సారించారు. ఇందులో భాగంగా పట్టణాల్లో, ఇతర ప్రాంతాల్లో ఉద్యోగాల నిమిత్తం, వ్యాపారాల నిమిత్తం ఉండే వారికి అభ్యర్థులు ఫోన్ చేస్తూ ఓట్లు వేయాలని అభ్యర్థించడంతో పాటుగా గ్రామానికి రావ డానికి రవాణా ఏర్పాటుచేస్తున్నారు. వాహనాలను ఏర్పాటుచేయమంటే ఏర్పాటు చేయడం, లేదంటే రవాణా ఖర్చుల నిమిత్తం డబ్బులను ఆన్‌లైన్ ద్వారా పంపించ డం చేస్తున్నారు. ప్రతిగ్రామంలో సర్పంచ్, వార్డుస్థానా లకు పోటీ ఎక్కువగా ఉండటంతో గ్రామం వెలుపల ఉండే ఓటర్లే వారి విజయానికి కీలకం కానున్నారు. దీంతో పట్టణాల్లో, ఇతర ప్రదేశాల్లో ఉండే వారికి ఖర్చు ఎంతపెట్టడానికైనా వెనకాడట్లేదు.

ర్యాలీలు, విస్తృత ప్రచారం..

చివరి రోజు మంగళవారం అభ్యర్థులు గ్రామాల్లో మంది మార్బలంతో ర్యాలీలు నిర్వహించారు. గ్రామాల్లో ఒక్కొక్కరికి రూ.200, రూ.300లు చెల్లించి దాదాపు 100 మందితో అభ్యర్థులు ర్యాలీలతో పాటుగా ఇంటింటికీ పలుమార్లు వెళ్తూ విస్తృత ప్రచారం నిర్వహించారు. అభ్యర్థుల ప్రచారం, ప్రచార రథాల పాటలతో సందడి నెలకొంది.

యువగళం

అభివృద్ధి చేసే వారికే ఓటేస్తా



మొదటి సారి ఓటు హక్కు రావడం ఆనందంగా ఉంది. తప్పకుండా ఓటు హక్కును సద్వినియోగం చేసుకుంటా. గ్రామాన్ని అభివృద్ధి చేసేవారికే ఓటు వేస్తాను. ఓటు హక్కు ఉన్న ప్రతి ఒక్కరు ఓటు హక్కును వినియోగించుకుని, ప్రలోభాలకు లొంగకుండా అభివృద్ధి చేసేవారిని ఎన్నుకోవాలి.

- కంజర్ సాయి రాఘవి, ఎడపల్లి

ప్రలోభాలకు లొంగిపోవద్దు



నాకు ఇటీవలే ఓటర్ కార్డు వచ్చింది. గ్రామాన్ని అభివృద్ధి చేసేవారికే ఓటు వేస్తాను. మంచి నాయకుడిని ఎన్నుకున్నప్పుడే గ్రామంలో నెలకొన్న సమస్యలతో పాటు అభివృద్ధి సాధ్యమవుతుంది. ఎన్నికల్లో గెలిచేందుకు చాలామంది మందు, విందులతో ప్రలోభాలకు గురిచేస్తారు. ఎవరు కూడా వాటికి లొంగిపోవద్దు. మంచి నాయకుడికే ఓటు వేయాలి.

- కేతావత్ శ్రీనివాస్, రామారెడ్డి

విద్యార్హత నిర్ణయించాలి



ఎన్నికల్లో పోటీచేసే అభ్యర్థులకు కనీస విద్యార్హతను నిర్ణయించాలి. అప్పుడే పాలకులుగా విద్యావంతులు వస్తారు. వారికి ప్రజల సమస్యల పట్ల అవగాహన ఉంటుంది. ప్రజా అవసరాలు తీర్చే నేతలను ఎన్నుకోవాలి. ఈ ఎన్నికల్లో తొలసారి ఓటు వేసే అవకాశం రావడం అదృష్టంగా భావిస్తున్నా. తొలి ఓటు వేస్తున్న అన్న సంతోషంగా ఉంది. అభివృద్ధి చేసే నాయకుడికే నేను ఓటువేస్తాను. చాలామంది అభ్యర్థులు ఓటర్లను మభ్యపెట్టేందుకు ప్రలోభాలకు గురిచేస్తుంటారు. ఎవరు కూడా ప్రలోభాలకు లొంగి ఓట్లను దుర్వినియోగం చేయొద్దు. ఓటు హక్కును నిర్భయంగా వినియోగించుకోవాలి.

- ఆడవ్ అన్వేష్

రోగులకు పండ్ల పంపిణీ

ఆర్మూర్‌టౌన్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో మంగళవారం రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పట్టణ అధ్యక్షుడు పూజ నరేందర్ మాట్లాడుతూ.. తెలంగాణ సాధన కోసం కేసీఆర్ ఢిల్లీ పీఠాన్ని గడగడలాడించి తెలంగాణ తలరాతను మార్చిన రోజును విజయ్ దివాస్‌గా జరుపుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ మాలీక్‌బాబ, అజీమ్, లతీఫ్, అహ్మద్ సత్తార్ తదితరులు పాల్గొన్నారు.



ఆస్పత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేస్తున్న నాయకులు

పైప్‌లైన్ లీకేజీ.. తాగునీరు వృథా

- నీరు కలుషితమవుతుందని ఆవేదన
- చర్యలు తీసుకోవాలని వేడుకోలు

జక్రాన్‌పల్లి, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): జక్రాన్‌పల్లి మండలంలోని మనోహరాబాద్ గ్రామంలో కొన్ని రోజుల నుంచి తాగునీటి పైప్‌లైన్ లీకేజీ అవుతోంది. లీకేజీ అయిన తాగునీరంతా వృథాగా పోతుందని ఆ గ్రామస్థులు చెబుతున్నారు. పైప్‌లైన్ లీకేజీ కాగా తాగునీరు కలుషితమవుతుందని, ఈ నీరు తాగడం వల్ల రోగాలబారిన పడే ఆస్కారం ఉందని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఈ సమస్యపై అధికారులు స్పందించి లీకేజీపడిన తాగునీటి పైప్‌లైన్‌కు మరమ్మతులు చేయించి నాణ్యమైన తాగునీరు సరఫరా చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు.



తాగునీటి పైప్‌లైన్ లీకేజ్ అయిన దృశ్యం

సోనియాగాంధీ జన్మదిన వేడుకలు

జక్రాన్‌పల్లి, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలో మంగళవారం కాంగ్రెస్ అగ్రనేత సోనియాగాంధీ జన్మదిన వేడు కలను మంగళవారం కాంగ్రెస్ నాయకులు నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్‌కట్ చేసి దివ్యాంగుల పాఠశాలలో దివ్యాంగుల విద్యార్థులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు వెంకటేష్, నాయకులు తిరుమలేషం, శ్రావణ్, ఆకాష్, నితిన్, సన్ని పాల్గొన్నారు.



జక్రాన్‌పల్లిలో విద్యార్థులకు పండ్లు పంపిణీ చేస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

కమ్మర్‌పల్లి: ఏఐసీసీ మాజీ అధ్యక్షురాలు సోనియా గాంధీ జన్మదిన వేడుకలను మండల కాంగ్రెస్ నాయకులు మంగళవారం ఘనంగ జరుపుకొన్నారు. ఈ సందర్భంగా స్థానిక కాంగ్రెస్ కార్యాలయంలో మండల పార్టీ అధ్యక్షుడు సుంకట రవి కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. 60 ఏళ్ల తెలంగాణ ప్రజల కోరికను నెరవేరుస్తూ తెలంగాణ ఇచ్చిన తల్లిగా తెలంగాణ ప్రజల గుండెల్లో సోనియాగాంధీ చిరస్థాయిగా నిలిచిపోతారని అన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ నాయకులు బుచ్చిమల్లయ్య, నిమ్మ ప్రసాద్, దూలూర్ కిషన్ గౌడ్, సల్లూరి గణేష్ గౌడ్, సుంకెట శ్రీనివాస్, జగదీశ్ పాల్గొన్నారు.



కమ్మర్‌పల్లిలో కేక్ కట్ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

వెంకన్న బ్రహ్మోత్సవాలు ప్రారంభం

మోర్తాడ్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తిమ్మాపూర్ గ్రామం లో లక్ష్మీవెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభమయ్యాయి. జాతర సందర్భంగా ఆలయాన్ని రంగురంగుల వెలుగులతో అందంగా తీర్చిదిద్దారు. మంగళవారం ఆలయంలో అగ్నిప్రతిష్ఠ, ధ్వజారోహణం, నిత్యహోమం, బలిహరణము జరిగాయి. గురువారం పద్మావతి, అలివేలిమంగ, వెంకటేశ్వర స్వామి కల్యాణమహోత్సవం, జాతర జరుతాయని గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు తెలిపారు. జాతర సందర్భంగా కామారెడ్డి, నిజామాబాద్ ఉమ్మడి జిల్లాస్థాయి లో వాలీబాల్, కబడ్డీ పోటీలు, బుధ, గురువారాలలో జరుగుతాయని పీఈటీ ఆనంద్ తెలిపారు. జాతర సందర్భంగా మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమాలు నిర్వహిస్తామని గ్రామకమిటీ సభ్యులు తెలిపారు. జాతరకు మండలంలోని గ్రామాల ప్రజలు పాల్గొని స్వామి కృపకు పాత్రులు కాగలరని ప్రధాన అర్చకులు శ్రీమస్‌చక్రపాణి మాదవచార్యులు కోరారు.

20 పంచాయతీలు.. 108 మంది బరిలో..

మద్నూర్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి మద్నూర్ మండలంలో 108 మంది సర్పంచ్ అభ్యర్థులుగా పోటీ చేస్తున్నారు. మద్నూర్ మండలంలో 21 గ్రామ పంచాయితీలలో ఒక గ్రామ పంచాయితీ ఏకగ్రీవంగా ఎన్నిక కావడంతో 20 గ్రామ పంచాయితీలకు ఈనెల 17న ఎన్నికలు జరగనున్నాయి. 69 మంది పోటీలో ఉన్నారు. అదే విధంగా 195 వార్డులు 50 వార్డులు ఏకగ్రీవం కాగా 139 వార్డులకు 403 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. డోంగ్లి మండలంలో 13 పంచాయితీలకు గాను ఒక గ్రామ పంచాయితీ ఏకగ్రీవంగా ఎన్నిక కావడంతో 12 గ్రామ పంచాయితీలకు ఎన్నికలు జరగనున్నాయి. ఈ గ్రామ పంచాయితీలలో 39 మంది అభ్యర్థులు పోటీలు ఉన్నారు. అదే విధంగా 253 వార్డు సభయలకు గాను 249 మంది బరిలో ఉన్నారు. కాగా ఎవరికి వారు గెలుపు కోసం హోరాహోరీగా ప్రచారం చేస్తున్నారు. కుల సంఘాల సభ్యులను కలుస్తూ ఓటర్లను తమవైపు తిప్పుకునేందుకు శతవిధాలా ప్రయత్నాలు చేస్తున్నారు. కొన్నిచోట్ల పోటాపోటీ ఉండగా మరికొన్ని చోట్ల గెలుపు సునాయాసంగా సాధించేలా పరిస్థితులు ఉన్నాయి. మరి చివరికి విజయం ఎవరిని వరిస్తుందో చూడాలి మరి.

బీబీపేటను అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తా



బీబీపేటలో ప్రచారం చేస్తున్న సర్పంచ్ అభ్యర్థి సుతారి మమతరమేష్

దోమకొండ, (బీబీపేట) డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): బీబీపేటను అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడానికే సర్పంచ్‌గా పోటీ చేస్తున్నట్లు సర్పంచ్ అభ్యర్థి సుతారి మమతరమేష్ అన్నారు. కాంగ్రెస్ పార్టీ, ప్రభుత్వ సలహాదారులు షబ్బీర్‌అలీ సహకారంతో బీబీపేటలో సర్పంచ్‌గా పోటీ చేస్తున్నట్లు ఆమె తెలిపారు. సీరియల్ నంబర్ 5లో లేడి పర్సు గుర్తుకు ఓటు వేసి భారీ మోజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. బీబీపేటను స్వచ్ఛగ్రామంగా తయారుచేయుటకు స్వయశక్తుల కృషి చేస్తానన్నారు. ఎలాంటి లాభాపేక్ష లేకుండా నిస్వార్థంగా ప్రతి ఒక్కరికీ అందుబాటులో ఉంటూ సేవలు అందిస్తానన్నారు. గ్రామంలో పారిశుధ్యం, విద్యుత్‌దీపాలు, నీటి సౌకర్యాలు కల్పిస్తూ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చూస్తానన్నారు. బీబీపేటను జిల్లాలో మోడల్ గ్రామ పంచాయతీగా తీర్చిదిద్దుతానని అన్నారు. యువతకు పుస్తకాలను అందుబాటులో ఉంచడం, క్రీడాకారులకు క్రీడామైదానం ఏర్పాటుచేసి క్రీడల్లో అసక్తి, నైపుణ్యం గల వారిని రాష్ట్ర, దేశస్థాయిలో వెళ్లేందుకు ప్రణాళిక చేసి ప్రోత్సహిస్తానన్నారు. ప్రచారంలో ఆమె వెంట నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

భిక్కనూరులో ఫిజియోథెరపీ చికిత్సలు



ఫిజియోథెరపీ చేస్తున్న వైద్యుడు నవీన్‌సాయి

భిక్కనూరు, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): భిక్కనూరు మండలకేంద్రంలోని భవిత కేంద్రంలో మంగళవారం ఫిజియోథెరపీ శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యుడు నవీన్‌సాయి ఆయా గ్రామాల నుంచి వచ్చిన దివ్యాంగ విద్యార్థులకు ఫిజియోథెరపీ చికిత్సలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈవో రాజ్‌గంగారెడ్డి, వైద్యుడు మాట్లాడుతూ.. విద్యార్థులకు ఫిజియోథెరపీ చేయడం వల్ల మానసిక ఉపశమనం కలుగుతుందని, వీరిని క్రమం తప్పకుండా మంగళవారం, గరువారం శిబిరానికి తీసుకురావాలన్నారు. పాఠశాల ఇన్‌చార్జి హెచ్‌ఎం భవాని, ఐఆర్పీ మహేందర్, స్పెషల్ ఎడ్యూకేషన్ టీచర్లు స్వప్న, శ్యాంరాజ్, సిబ్బంది చంద్రశేఖర్, మల్లేశం, సునీత, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

బాల్యవివాహాలను అరికట్టాలి



ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు

రామారెడ్డి, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాలను అరికట్టాలని, ఆ బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందని సూపర్‌వైజర్ జ్యోతి, రజిత అన్నారు. మంగళవారం మండలంలోని ఉప్పల్‌వాయి గురుకుల పాఠశాలలో బాల్య వివాహ్ ముక్త్ భారత్ కార్యక్రమంలో బాగంగా బాల్యవివాహాల నివారణ చట్టం 2006పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఈ మేరకు బాల్యవివాహాల వలన జరిగే అనర్థాలను, చట్టపరమైన అంశాలు, మత్తుపదార్థాలు, రోడ్డు ప్రమాదాల నివారణ చర్యలు, తదితర అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించి వారిచే ప్రతిజ్ఞ చేయించారు. బాల్యవివాహాలు, చిన్నారుల రక్షణ కోసం 1098, 100, 112 నెంబర్లకు సమాచారం అందించాలన్నారు. ప్రిన్సిపాల్ శివరాం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అయ్యప్ప ఆలయంలో బ్రహ్మోత్సవాలు

దోమకొండ, (బీబీపేట) డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి):బీబీపేట మండల కేంద్రంలో బుధవారం నుంచి శుక్రవారం వరకు అయ్యప్పస్వామి దేవాలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నట్లు అయ్యప్ప సేవా సంఘం సభ్యులు మంగళవారం తెలిపారు. బుధవారం ఉదయం గణపతి హోమం, కలశాభిషేకం, అష్టాభిషేకం, సాయంత్రం 6 గంటలకు ధ్వజారోహన కార్యక్రమం కేరళ గురుస్వామి తంత్రిశ్రీ ఉన్నిక్రిష్ణా నంబూద్రి ఆధ్వర్యంలో నిర్వహించడం జరుగుతందని తెలిపారు. గురువారం ఉదయం శ్రీహరిహరపుత్ర ఊరేగింపు, శుక్రవారం పూర్ణాహుతి అనంతరం అన్నప్రసాద కార్యక్రమం ఉంటాయని, సాయంత్రం 6.30కి ఉన్నిక్రిష్ణా నంబూద్రి ఆధ్వర్యంలో మహాపడిపూజ కార్యక్రమం నిర్వహించడం, భక్తులకు అల్పాహారం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. నంగూనూరి చంద్రశేఖర్, అయ్యప్ప సేవ సంఘం అధ్యక్షుడు చందుపట్ల విఠల్, కార్యదర్శి బాశెట్టి నాగేశ్వర్, కోశాధికారి మల్లారెడ్డిపేట పరశురాంగౌడ్ పాల్గొన్నారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో ఏడుగురిపై కేసు

కామారెడ్డి రూరల్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): కామారెడ్డి జిల్లా కేంద్రంలో ఎన్నికల సందర్భంగా మంగళవారం సాయంత్రం వాహనాల తనిఖీలను నిర్వహించినట్లు ట్రాఫిక్ ఎస్సై మహేష్ తెలిపారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. మద్యం సేవించి వాహనాలు నడిపిన ఏడుగురిపై డ్రంకెన్ డ్రైవ్ కేసులు నమోదు చేసి, హెల్మెట్ లేని 50 మందికి జరిమానాలు విధించామన్నారు. ట్రాఫిక్ నిబంధనలు ఎవరైనా ఉల్లంఘిస్తే సహించేది లేదని అన్నారు. వాహనాలు నడిపే సమయంలో ప్రతి ఒక్కరు హెల్మెట్ దరించాలని సూచించారు. పోలీసు సిబ్బంది పాల్గొన్నారు

అన్నా.. ఓటేయరావే..!

(5వ పేజీ తరువాయి)

ఇస్తే, మరికొందరు రూ.600లు ఇస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. కొన్ని ముఖ్యమైన పంచాయతీల్లో అయితే రూ.వెయ్యి కూడా చెల్లిస్తున్నట్లు వినికిడి.

వలస ఓటర్లకు ఫోన్

ఎన్నికల్లో పోటీ చేస్తున్న సర్పంచ్, వార్డు సభ్యుల అభ్యర్థులు స్వయంగా వలస ఓటర్ల ఫోన్ నెంబర్లు తీసుకొని ఫోన్ చేసి అభ్యర్థిస్తున్నారు. మా తరఫున పలానా వ్యక్తి వచ్చి మిమ్మల్ని కలుస్తాడు. మీరంతా నాకే ఓటు వేయాలంటూ సూచిస్తున్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రతీ పంచాయతీలో కూడా 90 శాతానికి పైగా ఓటింగ్ శాతం నమోదవుతోంది. దీనికి కారణం వలస ఓటర్లకు ఖర్చులు ఇచ్చి పిలిపించుకోవడమే లేకుంటే ఓటు వేయడానికి మేమెందుకు ఖర్చులు పెట్టుకుంటాం. పోటీ చేసేటోడు ఖర్చులు భరిస్తే వెళతామంటూ భీష్మించుకు కూర్చున్న వారు కూడా ఉన్నారు.

ఎక్కడున్నా.. ఓటు స్వగ్రామంలోనే..

బతుకుదెరువు కోసం కుటుంబాలతో సహ హైదరాబాద్, నిజామాబాద్, కామారెడ్డి పట్టణ ప్రాంతాల్లో ఎక్కువగా ఉన్నారు. ఆయా ప్రాంతాల్లో ఏళ్ల తరబడి స్థిరపడినా.. ఓట్లు మాత్రం ఇంకా గ్రామాల్లోనే ఉండటం విశేషం. ఇలా వేలాది మంది తమ పిల్లల చదువులు, ఉద్యోగరీత్యా, రియల్ ఎస్టేట్, ఇతర వ్యాపారాలు నిర్వహించుకుంటూ రాజధానిలో స్థిరపడ్డారు. అక్కడ ఉంటున్న వారు ప్రతీ ఎన్నికకు సొంత గ్రామానికొచ్చి ఓటు వేసి వెళ్తుంటారు. పంచాయతీ ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకునేందుకు ఆసక్తి చూపుతారు. కాగా పంచాయతీ ఎన్నికల్లో ఒక్కో ఓటు ఎంతో విలువైనది కావడంతో వలస ఓటర్లకు డిమాండ్ పెరిగింది.

ప్రయాణమే.. ప్రమాదమాయే..!

▸▸ గుంతలమయంగా జంగంపల్లి- దోమకొండ రహదారి ▸▸ తరచూ ప్రమాద ఘటనలు ▸▸ పట్టించుకోని అధికారులు

భిక్కనూరు, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): కామారెడ్డి నుంచి దోమకొండకు వెళ్లాలంటే దూరభారం అవ్వకూడదని భిక్కనూరు మండలం జంగంపల్లి గ్రామంలోని 44వ జాతీయరహదారి నుంచి దోమకొండ మండల కేంద్రం వరకు 2013 సంవత్సరంలో 5.6 కిలోమీటర్ల మేర బీటీరోడ్డు నిర్మించారు. ఈ బీటీ నిర్మాణం తర్వాత 44వ జాతీయరహదారి దగ్గర ఉండటంతో ఈ బీటీరోడ్డును ఆనుకుని కెమికల్ ఫ్యాక్టరీ, రైస్‌మిల్లు ఏర్పాటయ్యాయి. ఈ రైస్‌మిల్, కెమికల్ ఫ్యాక్టరీల నుంచి భారీ వాహనాలు నిత్యం రాకపోకలు సాగిస్తుండటంతో ఈ బీటీ రోడ్డు పూర్తిగా చెడిపోయి కంకర తేలి గుంతలమయంగా మారింది. దీంతో ఈ దారిగుండా వెళ్లే వాహనదారులు, జంగంపల్లికి చెందిన రైతులు వారి వ్యవసాయ బావుల వద్దకు వెళ్లాలంటే తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ భారీ వాహనాలకు తోడు ఈ



గుంతల మయంగా మారిన రహదారి

రోడ్డు గుండా కొందరు కేజీ వీల్స్‌ను నడపటంతో కూడా ఈ రోడ్డు అధ్వానంగా తయారైందని వాహనదారులు, స్థానికులు ఆరోపిస్తున్నారు.

తరుచూ ప్రమాదాలు..

ఈ రోడ్డుపై పూర్తిగా కంకర తేలి, గుంతలమయంగా మారడంతో పాటు రోడ్డుకు ఇరువైపులా పిచ్చిమొక్కలు మొలకెత్తడంతో తరుచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. కంకర తేలడంతో ద్విచక్రవాహనాలు అదుపుతప్పడం, రోడ్డు గుంతలమయంగా ఉండటంతో పాటుగా భారీ వాహనాలు వెళ్తున్న సమయంలో పెద్దఎత్తున దుమ్ము లేవడం, రోడ్డుకు ఇరువైపుల ఏపుగా మొలకెత్తిన చెట్ల కారణంగా మూలమలుపుల వద్ద సూచికబోర్డులు లేక ఎదురుగా వస్తున్న వాహనాలు కనిపించక ప్రమాదాలు చోటుచేసుకుని ఇప్పటివరకు చాలామంది గాయాలపాలయ్యారని వాహనదారులు, స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. స్థానికులు గానీ వాహనదారులు గానీ రైస్‌మిల్లు, కెమికల్ ఫ్యాక్టరీల యాజమాన్యాలను ప్రశ్నిస్తే వారు బెదిరించడంతో పాటుగా దురుసుగా ప్రవర్తిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పట్టించుకోని అధికారులు..

ఈ రోడ్డు పూర్తిగా పాడవడంతో నిత్యం ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని జంగంపల్లితో పాటుగా దోమకొండకు చెందిన వాహనదారులు, స్థానికులు ఎన్నిసార్లు సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్తున్న పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా



కంకర తేలి ప్రమాదకరంగా మారిన రోడ్డు

సంబంధిత అధికారులు పట్టించుకుని ఈ రోడ్డుకు మరమత్తులు చేయించి రోడ్డుకు ఇరువైపుల ఉన్న పిచ్చిమొక్కలను తొలగించాల దోమకొండ, భిక్కనూరు మండలాల ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.

మరమ్మతులు వెంటనే చేపట్టాలి



జంగంపల్లి నుంచి దోమకొండకు వెళ్లే బీటీ రోడ్డు అధ్వానంగా తయారైంది. రోడ్డుపై భారీ వాహనాలు వెళ్తుండటంతో కంకర తేలి, గుంతలయమంగా మారింది. ఈ రోడ్డు గుండా వెళ్లాలంటే వాహనదారులు భయాందోళనకు గురవుతున్న పరిస్థితి ఉంది. సంబంధిత అధికారులు వెంటనే రోడ్డు మరమ్మతు పనులు చేపట్టారు.

\- మీసాల ప్రవీణ్‌గౌడ్, జంగంపల్లి

దివ్యాంగ విద్యార్థులకు క్రీడాపోటీలు

నిజాంసాగర్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): నిజాంసాగర్ మండలకేంద్రంలోని మండల విద్యావనరుల కేంద్రంలో ప్రపంచ దివ్యాంగుల దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దివ్యాంగ విద్యార్థులకు డ్రాయింగ్, మ్యూజికల్ చైర్, రన్నింగ్ పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు ఎంపీడీవో శివక్రిష్ణ, ఎంఈవో తిరుపతిరెడ్డి బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో స్పెషల్ ఎడ్యూకేటర్ రాందాస్, ఐఆర్పీలు సునీల్, సాయిలు, తదితరులు పాల్గొన్నారు.



దివ్యాంగ విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

పోలింగ్ అధికారులకు శిక్షణ

ఎల్లారెడ్డి రూరల్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల పోలింగ్ పకడ్బందీగా నిర్వహించాలని ఎల్లారెడ్డి ఆర్డీవో పార్థసింహారెడ్డి అన్నారు. మంగళవారం ఎల్లారెడ్డి పట్టణకేంద్రంలోని ఫంక్షన్ హాల్‌లో రెండవ విడత పోలింగ్ అధికారులకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రెండవ విడత ఎన్నికల పోలింగ్ సజావుగా నిర్వహించాలని, ఎన్నికల విధులు నిర్వహిస్తున్న అధికారులు ఎలాంటి పొరపాట్లు జరగకుండా జాగ్రత్త వహించాలన్నారు. ఎల్లారెడ్డి డివిజన్ పరిధిలో విధులు నిర్వహించే అధికారులు, సిబ్బంది పోలింగ్ విజయవంతానికి కృషిచేయాలన్నారు. ఎంపీడీవో తాహేరా బేగం, పోలింగ్ సిబ్బంది పాల్గొన్నారు.



పోలింగ్ అధికారులకు శిక్షణ ఇస్తున్న అధికారులు

జోరుగా ఏకగ్రీవాలు..!

▸▸ 532 గ్రామ పంచాయతీలకు 75 జీపీలు ఏకగ్రీవం
▸▸ మొదటి విడుతలో 11 ... రెండవ విడుతలో 43
▸▸ మూడవ విడుతలో 21 జీపీలు ఏకగ్రీవం

కామారెడ్డి, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో మూడు విడతల్లో పంచాయతీ ఎన్నికలు జరుగుతున్నాయి. మొత్తం 532 గ్రామ పంచాయతీలు ఉండగా ఇందులో 75 గ్రామ పంచాయతీలు ఏకగ్రీవమయ్యాయి. మొదటి విడతలోని పది మండలాల పరిధిలో 167 గ్రామ పంచాయతీలు ఉండగా 11 జీపీలు ఏకగ్రీవమయ్యాయి. రెండవ విడతలో 197 గ్రామ పంచాయతీలు ఉండగా 43 జీపీలు, మూడవ విడతలో 168 గ్రామ పంచాయతీలు ఉండగా 21 జీపీలు ఏకగ్రీవమయ్యాయి.

మొదటి విడతలో ఏకగ్రీమైన పంచాయతీలు -11

మాచారెడ్డి -4
1. అంకిరెడ్డిపల్లి తండా
2. బోడిగుట్ట తండా
3. వెనుక తండా
4. ఎల్లంపేట

సదాశివనగర్ మండలం -3
1. తుక్కోజివాడి
2. సజ్జనాయక్ తండా
3. తిర్మన్‌పల్లి

రాజంపేట మండలం -2
1. గుడి తండా
2. షెర్ శంకర్ తండా

బీబీపేట్ మండలం -1
1. శివారు రాంరెడ్డి తండా

పాల్వంచ మండలం -1
1. భవానిపేట్ తండా

రెండవ విడతలో ఏకగ్రీమైన పంచాయతీలు - 43

గాంధారి మండలం -16
1. సోమ్లానాయక్ తండా
2. మాతుసంగెం
3. కాయితి తండా
4. రాంపూర్ గడ్డ తండా
5. మేడిపల్లి
6. పిస్కిల్ గుట్ట తండా
7. లొంకతండా
8. దుర్గం
9. గుడి వెనుక తండా
10. హేమ్లానాయక్ తండా
11. పొర్మల తండా
12. తిప్పారం తండా
13. గొల్లాడి తండా
14. సోమారం తండా
15. నేరల్ తండా
16. చెన్నాపూర్

లింగంపేట్ మండలం -14
1. అయ్యపల్లి తండా
2. బాణాపూర్
3. లింగంపల్లి కూర్దు
4. మలోత్ సంగ్యనాయక్ తండా
5. మలోత్ తండా
6. మెంగారం
7. ముంబోజిపేట్ తండా
8. నల్లమడుగు పెద్ద తండా
9. బాణాపూర్ తండా
10. ఒంటరి పల్లి
11. రాంపల్లి
12. సర్జన్ పల్లి
13. రాంపల్లి స్కూల్ తండా
14. ఎల్లారం

ఎల్లరెడ్డి మండలం -4
1. తిమ్మారెడ్డి తండా
2. హాజిపూర్ తండా
3. సమర్యగరి తండా
4. అజామాబాద్

నాగిరెడ్డి పేట్ మండలం -6
1. నాగిరెడ్డిపేట్
2. అంకంపల్లి
3. పల్లెబుగుడ తండా
4. మాసాన్‌పల్లి
5. అచ్చయపల్లి
6. వెంకంపల్లి

పిట్లం మండలం -1
1. గౌరారం తండా

నిజాంసాగర్ మండలం -1
1. మల్లుతండా

మహ్మద్ నగర్ మండలం -1
1. తెల్గాపూర్

మూడవ విడతలో ఏకగ్రీవమైన పంచాయతీలు -21

బాన్సువాడ మండలం -10
1. చిన్న రాంపూర్
2. జక్కల్‌దాని తండా
3. పులిగుచ్చ తండా
4. పోచారం
5. రాంపూర్ తండా
6. ఇబ్రహింపేట్ తండా
7. సోమ్లానాయక్ తండా
8. పులిగుండు తండా
9. కోయ్యగుట్ట తండా
10. బోర్లం క్యాంప్

పెద్దకోడప్‌గల్ మండలం -4
1. కటేపల్లి తండా
2. తలప్‌తండా
3. కుబ్యానాయక్ తండా
4. పోచారం

బిచ్కుంద మండలం -1
1. సీతారంపల్లి

నసురుల్లాబాద్ మండలం -3
1. బొప్పస్‌పల్లి
2. రాములుగుట్ట తండా
3. సంగెం -ఏ

బీర్కూర్ మండలం -1
1. బీర్కూర్ తండా

మద్నూర్ మండలం -1
1. బోజేగావ్

డోంగ్లీ మండలం -1
1. ఇల్లేగావ్

సోనియాగాంధీ జన్మదిన వేడుకలు

కామారెడ్డిటౌన్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): కామారెడ్డి జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మంగళవారం సోనియా గాంధీ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యాలయంలో పార్టీ రాష్ట్ర యువజన నాయకుడు మహ్మద్ ఇలియాస్ కేక్ కట్ చేసి స్వీట్లు పంచుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సోనియా గాంధీ నాయకత్వం దేశాన్ని ప్రజాస్వామ్య విలువల దిశగా నడిపించింది. ఆమె అడుగుజాడల్లో ప్రతి ఒక్క కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు నడవాలని తెలిపారు. అనంతరం పేదలకు బట్టలు, పండ్ల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు పండ్ల రాజు, మండల అధ్యక్షుడు గూడెం శ్రీనివాస్‌రెడ్డి, గుడుగుల శ్రీనివాస్, గోనే శ్రీనివాస్, సందీప్‌కుమార్, అతిక్, కన్నయ్య, పీఏ గంగాధర్, ఇస్రోజివాడి సుదర్శన్, అన్వర్, రాజేశ్వర్ పాల్గొన్నారు.



కామారెడ్డిలో వేడుకలు నిర్వహిస్తున్న దృశ్యం

పోలింగ్ విధులు పారదర్శకంగా నిర్వహించాలి

లింగంపేట, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): పోలింగ్ విధులను పారదర్శకంగా, సమర్థ వంతంగా నిర్వహించాలని ఆర్డీవో పార్థసింహారెడ్డి అన్నారు. మంగళవారం రెండవ విడత గ్రామ పంచాయతీ ఎన్నిక ల విధుల్లో పాల్గొనే ప్రిసైడింగ్ ఆఫీసర్లకు లింగంపేట డీపీఎల్ గార్డెన్‌లో శిక్షణ తరగతులు నిర్వహించారు. అధికారులు పోలింగ్ విధులను నిర్వహించే క్రమంలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. ఓటరు జాబితాను పక్కాగా పరిశీలించుకోవాలని, ఆ జాబితాకు అనుగుణంగా ఓటింగ్ ప్రక్రియను నిర్వహిం చాలని సూచించారు. సకాలంలో డిస్ట్రిబ్యూషన్ సెంటర్లకు చేరుకుని, పోలింగ్ మెటీరియల్‌ను తీసుకోవాలని అన్నారు. ఓటరు ఐడీ, ఆధార్ కార్డులే కాకుండా ఎన్నికల సంఘం నిర్దేశించిన 18 రకా ల గుర్తింపు కార్డులలో ఏదైనా ఒకదానిని చూపించి ఓటరు ఓటు వేయవచ్చని తెలిపారు. పోలింగ్ కేంద్రా నికి వచ్చి బ్యాలెట్‌పత్రం పొందిన ఓటరు తప్పనిసరిగా ఆ పత్రాన్ని బ్యాలెట్ బాక్సులో వేసి ఓటు హక్కు వినియోగించుకునేలా నిశిత పరిశీలన చేయాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ ఒక్క బ్యాలెట్ పత్రం



శిక్షణ తరగతులలో మాట్లాడుతున్న ఆర్డీవో

కూడా బయటకు వెళ్లకూడదని సూచించారు. టెండర్ ఓటుకు ఆస్కారం లేకుండా పక్కాగా పరిశీలన జరపాలని సూచించారు. స్టేజ్-2 అధికారులు మినహా మిగతా మరెవరి వద్ద కూడా సెల్ ఫోన్లు ఉండకూడదని, పోలింగ్ కేంద్రం బయట సెల్ ఫోన్లను తీసుకుని భద్రపర్చేలా కౌంటర్ ఏర్పాటు చేయించాలని అన్నారు. ఓటర్లను ఎలాంటి ప్రలోభాలకు గురి చేయకుండా చూడాలన్నారు. ఎంపీడీవో నరేష్, తహసీల్దార్ సురేష్‌లతో పాటు పీవోలు, ఏపీవోలు ఉన్నారు.

మత్తుపదార్థాలకు బానిస కావొద్దు

(5వ పేజీ తరువాయి)

అన్నారు. కార్యక్రమంలో పాఠశాల స్పెషల్ ఆఫీసర్ హరిప్రియ, జిల్లా సైకియాట్రిక్ సోషల్ వర్కర్ డాక్టర్ రాహుల్, సూపర్‌వైజర్ గంగామణి, ఆరోగ్య కార్యకర్త శ్రీలక్ష్మీ, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మానసిక సమస్యలపై విద్యార్థులకు అవగాహన

రాజంపేట: మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలలో మంగళవారం విద్యార్థులకు మానసిక సమస్యలపై, మాదక ద్రవాల వినియోగ ప్రభావంపై గురువారం వైద్య ఆరోగ్య,ఎక్సైజ్ శాఖల ఆధ్వర్యంలో అవగాహన కల్పించినట్లు మెడికల్ ఆఫీసర్ డా.విజయమహాలక్ష్మి తెలిపారు. ఈసందర్భంగా జిల్లా మానసిక వైద్యాధికారి డా.రమణ మాట్లాడుతూ.. ఆరోగ్యం, మానసిక ఆరోగ్యం బేధాలను, చికిత్స విధానాలను తెలియజేస్తూ విద్యార్థులకు టీనేజ్ వయస్సులో వచ్చే అవరోధాలను కూలంకుశంగా వివరించారు. పాఠశాల స్పెషల్ ఆఫీసర్ శ్రీవాణి, జిల్లా సైకియాట్రిక్ సోషల్ వర్కర్ డా.రాహుల్ కుమార్, సూపర్ వైజర్ గంగమణి, మంజూర్, ఆరోగ్య కార్యకర్త నాగలక్ష్మి,ఉపాధ్యాయులు,పోలీసు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మొదటి విడత ప్రచారానికి తెర

(5వ పేజీ తరువాయి)

వలస వెళ్లారు. ఆ ఓటర్లకు అభ్యర్థులు ఫోన్లు చేసి పోలింగ్ రోజు ఓటు వేసేందుకు గ్రామానికి రావాలంటూ అభ్యర్థిస్తున్నారు. వలస ఓటర్లను పోలింగ్ రోజు గ్రామానికి రప్పించేందుకు ప్రత్యేక వాహనాలను సైతం సమకూరుస్తున్నారు.

ప్రలోభాలకు తెరలేపిన అభ్యర్థులు

పంచాయతీ ఎన్నికలకు సంబంధించి ప్రచారం ముగిసింది. ఎలాగైనా గెలవాలని ఆశతో అభ్యర్థులు ప్రలోభాలకు తెర లేపారు. ఇప్పటి వరకు ఇంటింటా, సోషల్ మీడియా ద్వారా ప్రచారానికి తలమునకలైన సర్పంచ్ వార్డ్ మెంబర్ అభ్యర్థులు ఓటు తమ వైపు తిప్పుకునేందుకు ప్రలోభాలపై దృష్టి పెట్టారు. మాంసం, మద్యం పంపిణీ చేస్తున్నారు. అవి వద్దనుకునే వారికి స్వీట్లు, కూల్ డ్రింక్స్ అందజేస్తున్నారు. మరికొందరు కుటుంబంలో ఓట్ల చొప్పున నగదు సైతం పంపిణీ చేస్తున్నట్లు సమాచారం. ఈ రెండు రోజులు ఓట్లను తమకు పడేవిధంగా అభ్యర్థులు ప్రలోభాలకు గురి చేస్తున్నారు.

వామ్మో.. చలి పులి

(5వపేజీ తరువాయి)

దిచక్ర వాహనదారులు మఫ్లర్లు, హెల్మెట్ పెట్టుకోవడం వంటి జాగ్రత్తలు తీసుకుంటున్నారు. రాత్రి వేలలో, తెల్లవారు జమున చలి తీవ్రతతో ప్రజలు బయటకు వెళ్లలేని పరిస్థితి ఎదురవుతోంది. చలి తీవ్రత ఎక్కువగా ఉన్నందన వృద్ధులు, చిన్న పిల్లలు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు జాగ్రత్తగా ఉండాలని వైదులు సూచిస్తున్నారు.

ప్రాంతల వారీగా కనిష్ఠ ఉష్ణోగ్రత వివరాలు

ప్రాంతం	కనిష్ఠ ఉష్ణోగ్రత	గరిష్ఠ ఉష్ణోగ్రత
బీబీపేట్	7.9	29.3
బొమ్మన్‌దేవునిపల్లి	8.0	29.3
నసురుల్లాబాద్	8.2	29.5
మేనూర్	8.2	29.2
డోంగి	8.2	30.4
లచ్చపేట్	8.3	31.1
దోమకొండ	8.3	29.0
ఎల్పుగొండ	8.6	31.4
బీర్కూర్	8.8	32.2
రామలక్ష్మణ్‌పల్లి	8.8	27.7
సర్వాపూర్	8.9	31.2
జుక్కల్	8.9	30.1
పెద్దకొడప్‌గల్	9.1	29.6
గాంధారి	9.1	28.0
బిచ్కుంద	9.2	30.5
నాగిరెడ్డిపేట్	9.3	29.3
ముగ్దాపూర్	9.6	28.3
పిట్లం	9.6	30.1
రామారెడ్డి	9.6	31.7
మాచాపూర్	9.7	29.7
ఇసాయిపేట్	9.7	28.0

పోలింగ్‌కు ఏర్పాట్లు పూర్తి

(5వ పేజీ తరువాయి)

ఎన్నికలు నిర్వహించాల్సి ఉన్న గ్రామాలకు ప్రెసిడింగ్ అధికారులు, ఓపీవోలను కేటాయించారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల పరిశీలకులు సత్యనారాయణరెడ్డి, అదనపు కలెక్టర్ మదన్‌మోహన్ తదితరులు పాల్గొన్నారు.

10 మండలాల్లో వైన్స్‌లు బంద్

కామారెడ్డి రూరల్: ఈ నెల 11న మొదటి విడుత పంచాయతీ ఎన్నికలు జరుగనున్న నేపధ్యంలో 10 మండలాలైన భిక్కనూరు, దోమకొండ, బీబీపేట్, మాచారెడ్డి, పాల్వంచ, రామారెడ్డి, సదాశివనగర్, కామారెడ్డి, తాడ్వాయి, రాజంపేట్ లలో మద్యం దుకాణాలు మూసి ఉంచాలని ఆదేశించారు. మంగళవారం సాయంత్రం 5 గంటల నుంచి ఓట్ల లెక్కింపు పూర్తి అయ్యే వరకు మద్యం దుకాణాలు మూసివేయాలని అధికారులను ఆదేశించారు. అదే విధంగా ఎన్నికల ప్రచారం సైతం మంగళవారం సాయంత్రం 5 గంటల లోపు ముగిసిందన్నారు. మొదటి విడతలోని ఆయా గ్రామ పంచాయతీల అభ్యర్థులు ప్రచారం చేయవద్దని సూచించారు.

పోలింగ్ నిర్వహణపై శిక్షణ

కామారెడ్డి రూరల్, డిసెంబరు 09 (ఆంధ్రజ్యోతి): కామారెడ్డి ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం ఎన్నికల సిబ్బందికి పోలింగ్ నిర్వహణపై అవగాహన కల్పించినట్లు ఎంపీడీవో హెప్సిబా రాణి తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఎన్నికల సిబ్బంది బ్యాలెట్ బాక్స్‌ల్లో ఓటింగ్ వేసే విధానం, ఓట్ల లెక్కించి, సర్పంచ్ అభ్యర్థి గెలిచిన తర్వాత, ఉప సర్పంచ్ అభ్యర్థిని బలపర్చిన సమయంలో ఏయే పత్రాలను జతపర్చాలని సూచించారు. పోలింగ్ కేంద్రాల్లో నిర్లక్ష్యం చేస్తే తగిన చర్యలు ఉంటాయని తెలిపారు.

సినిమా గైడ్

కామారెడ్డి

ప్రియ 70- ఆంధ్రా కింగ్ తాలుకా
ప్రియ 35- రాజు వెడ్స్ రాంబాయి
దర్శన్- జటాధర

బాన్సువాడ

మహేశ్వరి ఆంధ్రాకింగ్ తాలూకా
వెంకటేశ్వర కలివివనం

చికెన్ ధరలు

రకం	సుగుణ	వెన్‌కాబ్
లైవ్	రూ.140	రూ.170
స్కిన్	రూ.200	రూ.210
స్కిన్‌లెస్	రూ. 220	రూ.230